శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



Divine Decade



# గురుకృప

ఆరాధనోత్సవ సంచిక

మనసా... వాచా... కర్మణా... కైమోడ్పులర్పణే ఆరాధన



గురుదేవా!
మాపై అవ్యాజమైనది మీ ప్రేమానుగ్రహం!
మిము అనుసరించింది కృతజ్ఞతతో నిండిన మా అంతరంగం!
పర్యవసానంగా రెండుగా చూడలేని మనస్సుకు అంతా 'మీ' మయం!
అదే బాబా చెప్పిన అడ్డుగోడలు తొలగించేందుకు
తరుణోపాయం!
ఇలా సాయిభక్తి సదాచార పాలనలో మీరెప్పుడూ
మకుటాయమానం!
అంతా బాగానే ఉంది... నా హృదయాన్ని పరిచి మీ పాదాల
ముందు పెడుతున్నాను.
నా వాస్తవంలోకి కాస్త సమయం చేసుకొని తొంగి చూడండి
స్వామీ...

అంధుడనై కళ్ళు కుట్టుకున్నా కనిపించని
గాడాంధకారంలో ప్రయాణిస్తూ
అలసిపోతున్న వేళ!
వెలుగురేఖలు చిమ్మి దారిని చూపి
దశ దిశ నిర్దేశించే మీ అనుగ్రహానికి ఆనందపడాలా!
అనుక్షణం రక్షించి నా అడుగు అడుగును కావలికాసే మీ కరుణకు కృతజ్ఞతతో కరిగిపోవాలా?
అన్నింటికన్నా ఆ తేజోమయ మార్గాన్ని కాననైనా లేని నా అంధత్వాన్ని
అంతం చేయమని మీకు సాగిలపడాలా?

పుట్టు చెవిటినై చుట్టుముట్టిన సంకుచితాలు, ఈర్ష్యాద్వేషాల్లో సమిధనై అట్టుడుకుతున్న వేళ!
మృదుమధురభాషణలతో నా అంతఃకరణాన్ని అలవోకగా ఆక్రమించే మీ అనుగ్రహానికి ఆనందపడాలా?
మంత్రముగ్ధమైన మాటలతో నా ప్రతిమాటను నియంత్రించే మీ కృపకు కృతజ్ఞతతో కరిగిపోవాలా?
అన్నింటికన్నా ఆ మంత్ర సమన్వితమైన వాక్కులను విననైనాలేని నా బధిరత్వాన్ని బాపమని మీకు సాగిలపడాలా?

దురలవాట్లకు బానిసనై దుర్మార్గాల వ్యామోహంలో దుర్గంధాలను పీల్చి పీల్చి ఊపిరిసల్పలేక ఆయాసపడుతున్న వేళ
కరుణాంతరంగపు పవనాలు వీచి గంధర్వ గానాలతో మీ స్మరణ నా మదిన నింపిన మీ అనుగ్రహానికి ఆనందపడాలా?
పులకించే మది తరంగాలలో అవలోకించి, క్షాళణ చేసే స్వచ్ఛ వాయువులు నింపిన
మీ అనురాగానికి కృతజ్ఞతతో కరిగిపోవాలా?
అన్నింటికన్నా ఆ కరుణాపూర్ణ అంతరంగపు సువాసనను ఎరగలేకపోయిన
నా మూర్ఖత్వాన్ని మసి చేయమని మీకు సాగిలపడాలా?

జిహ్వ నానా రుచుల రంజులో నిస్సారమైపోయిన జీవనశైలి, ఎడాపెడా సంపాదనే లక్ష్యంగా గతితప్పి అస్తవ్యస్తమవుతున్నవేళ!
అమృతమయమైన మీ ఉచ్ఛిష్టాన్ని ఆహారంగా, దాన్ని నిజాయితీగా కూర్చుకునే దారిని చూపిన
మీ అనుగ్రహానికి ఆనందపడాలా?
మృతమైనది దరిచేరనీయక, కష్టించి సంపాదించుకునే రుచికరమైన జీవన కళను నేర్పిన
మీ అమృతత్వానికి కృతజ్ఞతతో కరిగిపోవాలా?
అన్నింటికన్నా అతులిత గుణధామమైన మీ ఆదర్శం రుచించని నా మొద్దుబారిన నాలికను
నయం చేయమని మీకు సాగిలపడాలా?

సంపుటి : 23
సంచిక : 5



నవంబర్ 13
2020

గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో





సాయిపథంలో సన్నిధానం – ఎస్.వి.ఎల్. నారాయణరావు 4

మానవత్వమే దైవత్వం పూర్ణత్వం – డా॥ శ్రీనివాసులరెడ్డి 9

ప్రేమపథంలో దశాబ్ది ఆరాధనోత్సవం – ఉపేంద్ర 11

నిరంతర ప్రవాహం – 'శరచ్చంద్రికలు' 17

మహిని వెలసిన మహోన్నత సద్గురువు... – శేఖర్ 24

'కవి' పరిణయం – భీమ్ 24

గురుకృపాలహరి – గురుకృప 34


నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# సాయిపథంలో సన్నిధానం దశాబ్ది వేడుకలకు సన్నద్ధం

ఈ సంవత్సరం నవంబరు పదవ తేదీన ప్రారంభమయ్యే మన పూజ్య గురుదేవుల ఆరాధనోత్సవాలు పదేళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా 'గురుకృప' దశమ ఆరాధనోత్సవ సంచికకు నన్ను ఏదైనా పంచుకోమని కోరడం సాయికృపకు సంకేతంగా తోచి ఎంతో ఆనందించాను. గురువుగారి ప్రేరణతో, నా అవగాహనమేరకు, నాకు తోచింది మీతో పంచుకునే ప్రయత్నం చేస్తాను. ఈ అవకాశం ఇచ్చిన గురుకృప నిర్వాహకులకు నా కృతజ్ఞతాభివందనలు. సన్నిధానం దశాబ్ది వేడుకల సందర్భంగా అప్రయత్నంగా నాచే ఈ విధంగా వేడుకల్లో ముందుగానే పాలుపంచుకునేట్లు చేసిన సద్గురు సాయినాథునికి, పూజ్య గురుదేవుల పాదపద్మాలకు సాష్టాంగ నమస్కారాలు.

***'సమాధి'కి సరైన సమాధానం :***

"నా మట్టి మాట్లాడుతుంది. నా సమాధి సమాధానమిస్తుంది" అన్న శ్రీసాయి మాట అక్షర సత్యమని శ్రద్ధగా శిరిడీ సందర్శించే ప్రతి సాయిభక్తుడి అనుభవం. బాబా మహాసమాధి చెందిన ఒక శతాబ్దం తరువాత కూడా ఈనాటికీ శ్రీసాయిసమాధిమందిరాన్ని దర్శించిన భక్తులకు ఆ సద్గురుమూర్తి దివ్యసన్నిధి అనుభవమవడం నిత్యసత్యం. దినదిన ప్రవర్ధమానమౌతున్న శిరిడీక్షేత్ర వైభవం, అసంఖ్యాకంగా పెరిగిపోతున్న శిరిడీ సందర్శకుల సంఖ్య చూస్తుంటే అపారంగా విస్తరిస్తున్న శ్రీసాయిమహిమకు అసలు పరిమితి అంటూ ఉన్నదా అని అనిపించక మానదు. శ్రీసాయి మహాసమాధి అనంతరం కూడా వారి అవతార కార్యాన్ని ఎలా కొనసాగిస్తున్నారు? వారు సజీవంగా ఉన్నప్పటి వలెనే ప్రతి జీవిని, వాని అవసరాలకనుగుణంగా ఎలా ఆదుకుంటున్నారు? వారు నిజంగా సమాధి చెందారా? అసలు సమాధి అంటే ఏమిటి? అన్న ప్రశ్నలు కొంతమంది జిజ్ఞాసువులకు ఉదయించవచ్చు. ఇలాంటి ప్రశ్నలే అడిగిన భక్తులతో, మన గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ చెప్పిన సమాధానం, సమాధిని గూర్చి వివరించిన వైనం అనిర్వచనీయం. "నా ముర్షద్ నన్ను ఏనాడో ఈ దేహం నుండి విడుదల చేశాడు" అన్నారు బాబా. అంటే **నడయాడే ఆ దేహం కదలాడే సమాధి** అన్నమాట. అందుకే బాబా ఏనాడూ తమ దేహానికి పరిమితమైలేరు. "ఎవరైతే ఈ మూడున్నర మూరల దేహమే **'సాయి'** అనుకుంటారో, వారసలు **సాయి**ని చూడనట్లే" అనేవారు. వారు పొందిన మహోన్నతస్థితే వారిని సద్గురు సామ్రాట్టుగా నిలబెట్టింది. ఏ స్థితి ఆనాడు కోరికలను, అవసరాలను

తీర్చిందో అదే స్థితి ఈనాటికీ అసంఖ్యాకంగా పెరుగుతున్న భక్తుల అవసరాలనూ తీరుస్తున్నది. అందుకే అన్నారు సాయి “నా సమాధి సమాధానమిస్తుంది” అని. ఏ స్థానం మన సమస్యలకు సమాధానమిస్తుందో, ఏ స్థానం మన అవసరాలను తీరుస్తుందో, ఏ స్థానం అస్పష్టమైన మన సంపూర్ణత్వ భావనను సుస్పష్టం చేస్తుందో, అదే అసలైన సమాధి. ఒక్క మాటలో చెప్పాలంటే దేని కోసం మనం పరితపిస్తున్నామో దానిని అక్కడితో పరిసమాప్తం చేసేదే సమాధి.


***సన్నిధానం - సదా గురువుగారి సన్నిధిని ప్రసాదించే పుణ్యధామం!***

ఈ నేపథ్యంలో లేదా ఈ వెలుగులో చూస్తేనేగాని శిరిడీలో సాయిపథం ఆవరణలో మన పూజ్య గురుదేవుల సమాధి ప్రాంగణమైన ‘సన్నిధానం’ యొక్క అపూర్వ ప్రాశస్త్యం కొంచెంగానైనా అవగాహన కాగలదు. గురువుగారు సమాధి చెంది ఒక దశాబ్దం పూర్తవుతున్నా, ఈనాటికీ సన్నిధానాన్ని సందర్శించిన భక్తులకు వారి సన్నిధి సదా అనుభవమౌతూనే ఉంది. గురువుగారిని సశరీరులుగా దర్శించుకున్న ఎందరో భక్తులకు, ఆనాడు గురువుగారు వారి సమస్యలకు ఎలా స్పందించి కాపాడారో, ఈనాటికీ అలాగే స్పందిస్తున్నారన్నది వారి అనుభవం. అది నా అనుభవం కూడా.

గురువుగారిని మొట్టమొదట దర్శించుకునే భాగ్యం నాకు 1984లో కలిగింది. గత జన్మలో ఏం చేశానో, ఎంత చేశానో తెలియదుగాని, ఈ జన్మలో మాత్రం వారిని దర్శించుకునే భాగ్యమేకాదు, వారిని ప్రత్యక్షంగా సేవించుకునే మహాభాగ్యాన్ని కూడా వారే కరుణతో నాకు ప్రసాదించారు. 1984 నుండి 2010 వరకు అంటే దాదాపు 26 ఏళ్ళు ఇటు ప్రత్యక్షంగాను, అటు పరోక్షంగాను వారి సాన్నిధ్యాన్ని అనుగ్రహించారు. వారితో గల సాన్నిహిత్యం, సాహచర్యం వల్ల వారు సశరీరులుగా ఉన్నప్పుడు కూడా దేహానికి పరిమితమైలేరని, వారు దేహాతీతులని, వారి అతీత స్థితి మన ఊహకందనిదని అనుభవపూర్వకంగా ఎన్నో సంఘటనల ద్వారా తెలిసి వచ్చింది.

గురువుగారు పొందిన ఆ అద్భుత స్థితే ఆనాడు, ఈనాడు, ఏనాడూ-ఎవరు, ఎక్కడ నుండి ఏం అడిగినా సమాధానమిస్తూనే ఉంది. అప్పటి అవసరాలకనుగుణంగా దేహధారియై, దరిచేరిన వారిని ఆదరించి, సేదతీర్చి, సమస్యలను సమాధాన పరచి, సాయిప్రేమను చవిచూపించి, సాయిపథాన నడిపించారు. అయితే ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్య, మరియు మారుతున్న భక్తుల అవసరాలకనుగుణంగా వారి కదలాడే ఆ సమాధి(ఆ దేహం) రూపాంతరం చెంది ఇలా మనకు సన్నిధానమై దర్శనమిస్తుంది. **‘సన్నిధానం’ అంటే గురువుగారి దివ్య సన్నిధిని సదా మనకందించే పుణ్యధామమే కదా!**





### ఆరాధనోత్సవాల ఆరంభం - వర్ధంతి వేడుకల సంరంభం

నవంబరు 13, 2010 మధ్యాహ్నం గం1.51నికి (భారత కాలమాన ప్రకారం) గురువుగారు సమాధి చెందారు. ఆనాటి నుండి ప్రతి ఏటా మన ఆరాధ్యదైవమైన గురువుగారి సన్నిధానంలో ఆరాధనోత్సవాలు ఎంతో వేడుకగా జరుగుతున్నాయి. ఏడు రోజులపాటు సాగే ఈ ఉత్సవాలలో మొదటిగా చెప్పుకోవాల్సిన ఘట్టం - సాయినామ సప్తాహం. ఆర్తితో ఎలుగెత్తి 'సాయిబాబా, సాయిబాబా' అని పిలవడంలో నేనంటే నేనన్నట్లుగా జోరుగా సాగే సాయినామ సంకీర్తన, సాయిపథ ప్రాంగణాన్నంతా గురువుగారికి అత్యంత ప్రీతిపాత్రమైన సాయినామంతో హోరెత్తిస్తుంది. తరువాత ఆ వేడుకల్లో ప్రదర్శింపబడే గురువుగారి ఆడియో, వీడియో క్లిప్పింగ్స్ గురువుగారి పట్ల ప్రేమను, సాయిపట్ల జిజ్ఞాసను పెంపొందిస్తాయి. భక్తుల సౌకర్యార్థం ఆహార, ఆరోగ్య సదుపాయాలు కల్పించబడటం విశేషం. అటు సాయిపథ సత్సంగ ప్రాంగణంలో కొలువు తీరిన బాబాను, ఇటు గురువుగారి సమాధి ఉన్న సన్నిధానంను భక్తులు తామే స్వయంగా ప్రతిరోజూ ప్రేమతో పూలుగుచ్చి, అందంగా అలంకరించడం చూస్తే వారి మనసులు వికసించిన కుసుమాలై తమ గురుదేవుని పాదపద్మాలను అర్చిస్తున్నాయా అని అనిపిస్తుంది. దేశవిదేశాల నుండి విచ్చేసిన గురుబంధువులు ఇలా వివిధ కార్యక్రమాల్లో శ్రద్ధగా పాల్గొని గురువుగారి పట్ల, సాటి వారి పట్ల తమ ప్రేమను వ్యక్తపరచడం చూస్తే, అది గురువుగారు వారిలో పంచిన ప్రేమకు, పెంచిన ప్రేమకు నిదర్శనమేమోననిపిస్తుంది. అలా ఆ ఏడు రోజులు ఏడు క్షణాలలాగా జరిగిపోతాయంటే అతిశయోక్తి కాదు.

ఇలా 2010వ సంవత్సరంలో ప్రారంభమై ఏటేటా జరుగుతున్న ఆరాధనోత్సవాలు **'ఎట్టెట్టా'** అన్నంత అమితోత్సాహంతో కన్నుల పండుగగా జరుగుతున్నాయి. భక్తులలో పొంగుతున్న ప్రేమ, పెరుగుతున్న ఉత్సాహం, పొందుతున్న ఆనందం, కలుగుతున్న అనుభవాలు కళ్ళారా చూస్తుంటే మహాత్ములు సమాధి చెందిన రోజును వర్ధంతి అని ఎందుకంటారో ఇట్టే అర్థమవుతుంది. **వర్ధనం** అంటే పెరగడం అని కదా అర్థం. నిజానికి ఇక్కడ ఏం పెరుగుతుంది? ఆరాధనోత్సవాలకు హాజరయ్యే భక్తుల సంఖ్యా? అంబరాన్ని అంటుతున్న సంబరాలా, సన్నాహాలా? చోటు చేసుకుంటున్న మార్పులు చేర్పులా? భక్తుల సౌకర్యార్థం చేసే సేవా కార్యక్రమాలా? ఏమిటి? ఏమవుతోంది? ఇక్కడ పెరుగుతున్నది ప్రేమ! కేవలం ప్రేమ! బాబా, గురువుగార్లపై మన ప్రేమ! పైన పేర్కొన్నవన్నీ మనలో పెరుగుతున్న ప్రేమకు బాహ్యమైన వ్యక్తీకరణలే. ఆ ప్రేమే కదా మనకి గురువుగారికి మధ్య ఉండే వారధి. మనల్ని


గురువుగారిని కలిపే (connect చేసే) వారధి! సంసార సాగరంలో, కష్టాల కడలిలో కొట్టుకుని పోకుండా కాపాడే వారధి. నిలకడగా, నిశ్చింతగా, సునాయాసంగా సాయి దరిని చేర్చే వారధి.

ఆ వారధి లేదా ఆ బంధం బలోపేతమై మనలను, గురువుగారిని విడదీయలేని బంధమవ్వాలి. గురువుగారు మనకందించిన సాధనలు – శిరిడీ సందర్శించడం. సత్సంగాలకు వెళ్ళడం, సచ్చరిత్రను శ్రద్ధగా చదవడం, ఆర్తితో బాబాను పిలవడం మొదలైనవన్నీ బాబాతో మనకు గల బంధాన్ని బలప్రదం చేయడానికే. అలా బలోపేతం చేసే సాధనలు, పరికరాలు, మార్గాలు ఇంకా ఎన్నో ఎన్నో ఎవరికి వారు ఆవిష్కరించుకోవాలని గురువుగారు ఎప్పటికప్పుడు మనలను ప్రేరేపిస్తూనే ఉన్నారు. సాయినాథుని అనుగ్రహంతో సాయిపథం అలాంటి వేదికలను ఎప్పటికప్పుడు ఆవిష్కరిస్తూనే ఉంది. ఇటీవలి కాలంలో ఇందుకు చక్కటి ఉదాహరణ 'సాయి కనెక్ట్' ఆవిష్కరణ.

### *Sai Connect కరోనాకు అదే correct*

కరోనా వైరస్ (కోవిడ్–19) ప్రపంచాన్ని ఎలా గడగడలాడించిందో, లోకమంతా ఎలా అతలాకుతలమైందో, జనమంతా ఎంత భయభ్రాంతులయ్యారో, ఎంతో మంది ఎటువంటి దయనీయ స్థితిని ఎదుర్కోవలసివచ్చిందో మనందరికీ తెలిసిన విషయమే. లాక్‌డౌన్ అమలులో ఉన్నా అందరిలా భయంతో లాక్ చేసుకుని నిస్పృహతో డౌన్ అయిపోకుండా, గురుబంధువులందరూ తమనుతాము అభయప్రదాతయైన బాబాతో లాక్ చేసుకుని, ఆన్‌లైన్ సత్సంగాలతో, బాబా గురువుగార్లతో ఉన్న తమ బంధాన్ని డౌన్ కాకుండా ఇంకా అప్ చేసుకుంటున్నారు. అదే వారిలో కొండంత స్ఫూర్తిని నింపి, నిర్భయంగా, సమయస్ఫూర్తితో పరిస్థితులను చక్కగా ఎదుర్కొనే ఆ స్థైర్యాన్నిస్తోంది.

మారుతున్న పరిస్థితుల అవసరాలకనుగుణంగా, సమయోచితంగా సాయిపథం టీము ఆవిష్కరించిన సాయికనెక్ట్, యూట్యూబ్ ఛానల్, ప్రపంచ వ్యాప్తంగా గురుబంధువులందరూ బాబా గురువుగార్లతో గల తమ అనుభవాలను పంచుకునే ఒక విశిష్ఠమైన వేదికయింది. ప్రతిదినం సాయికనెక్ట్‌కు ఎప్పుడు కనెక్ట్ అవుదామా అని మనసు ఉవ్విళ్ళూరుతుంటుంది. ప్రతి ఒక్కరు తమలో వచ్చిన పరివర్తనను, గురువుగారు తమపై కురిపించిన అనుగ్రహ జల్లులతో మనందరినీ తడుపుతుంటే, **ఆహా! ఇదే కదా! ప్రేమైకపథం, సాయిపథం అంటే! అనిపించకమానదు.** బాబా గురువుగార్లతో మన ప్రేమానుబంధాన్ని ఇంకా ఇంకా పటిష్టం చేసే ఇటువంటి వేదికలనెన్నో మనందరికీ అందించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న సాయిపథగాములందరికీ నా హృదయపూర్వక అభినందనలు.





## సాయిపథం సభ్యులమా? సాయిపథగాములమా?

సాయిపథం అంటే శిరిడీ సాయిపథం ప్రాంగణంలో ఉన్న సత్సంగ మందిరం, వివిధ రాష్ట్రాలలో లేదా వివిధ దేశాలలో జరుగుతున్న సాయిపథం సత్సంగాలు, సాయిపథం నిర్వహిస్తున్న సాయిబాబా మందిరాలు, సాయిపథం పబ్లికేషన్స్ మాత్రమే కాదు. ఇవన్నీ గురువుగారు ప్రేమతో మనకందించిన మహత్తరమైన వేదికలు. అవన్నీ మన అనుబంధాన్ని, ప్రేమను పెంచి, మన జీవితాలలో కష్టాలు తొలగించి, ఆనందపు కాంతులను వెదజల్లే వెలుగు దీపికలు. అయితే ఇవన్నీ కేవలం వేదికలు మాత్రమేనన్న సత్యం మరువకూడదు. **ప్రతివారం లేదా ప్రతిరోజూ సాయిపథం సత్సంగానికి వెళ్ళేవారు సాయిపథం సత్సంగ సభ్యులు అవుతారుగాని సాయిపథగాములు మాత్రం కాలేరు. సాయి చెప్పిన మాటను ఆచరిస్తూ, సాయి చూపిన బాటను అనుసరించిన వారే సాయిపథంలో పయనిస్తున్నట్లు.**

***వారే కదా అసలైన సాయిపథగాములంటే!***

"ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గంలో నడిపిస్తాడు'' అన్నారు బాబా. బాబా పేర్కొన్న ఆ శుభ్రమార్గంలో అంటే బాబా పథంలో నడచి 'సాయి' అనే గమ్యాన్ని చేరుకున్న గురువుగారు సాయిభక్తులందరికీ ఆశాకిరణం, ఆదర్శప్రాయం అయ్యారు. వారు పొందిన అత్యుత్తమమైన ఆ స్థితిని ప్రతి ఒక్కరూ పొందాలని, తిరుగులేని, తరుగులేని ఆ ఆనందానుభవాన్ని, సాయి సంపూర్ణానుగ్రహాన్ని ప్రతి ఒక్కరూ అనుభవించాలన్న తపనతో వారు తమ గమ్యాన్ని చేరుకున్న తరవాత కూడా, మనకోసం, కేవలం మనందరి కోసం తిరిగి వచ్చి, తాము నడిచిన ఆ శుభ్రమార్గాన్ని మన కోసం మరింత సుగమం చేసి, అసలైన సాయిపథం ఏమిటో, ఆనందంగా, సునాయాసంగా సాయిని ఎలా చేరుకోవాలో తెలియజేయడమే కాదు, మనల్ని చేయిపట్టి నడిపిస్తున్నారు. అసలైన సాయిబాటను అందరికీ రాచబాటను చేశారు. అటువంటి రాచబాటలో గురువుగారి చేయిపట్టుకుని(అంటే వారి ఆదర్శాలను అంటిపెట్టుకుని) చిన్నపిల్లల్లా ఆడుతూ, పాడుతూ, ఎగురుతూ, గెంతుతూ, తుళ్ళుతూ, ఆనందంగా మన గమ్యాన్ని చేరుకుని జీవితాన్ని సార్థకం చేసుకుందామా? లేదా కక్షకార్పణ్యాలతో, ఆస్తులు, అంతస్థులు అంటూ కీచులాటలు, దెబ్బలాటలతో, వాడిట్లా వీడిట్లా వీడిది వాడిది అంటూ ఆ రాచబాటను రచ్చబాటగా మలచుకుని మనదైన పంథాలో నడుచుకుంటూ జీవితాన్ని దుర్భరం చేసుకుందామా? ఏం చేద్దాం? అన్నది మన చేతిలోనే ఉంది.

*సాయిపథగాములారా సన్నిధానం దశాబ్ది వేడుకలకు ఔదాం సన్నద్ధం :*

ఈ సంవత్సరం నవంబరు, 10 నుండి గురువుగారి ఆరాధనోత్సవాలు జరుపుకుంటున్నామన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ ఏటితో పదేళ్ళు పూర్తవడం మరో విశేషం. మనం ఎన్ని తప్పులు చేస్తున్నా, మనల్ని మన్నించి, మనం అడిగిందిస్తూ, మనల్ని కంటికి రెప్పలా కాపాడుతున్న గురువుగారికి మనమెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలి? మన ప్రేమను ఎలా వ్యక్తం చేయాలి? ప్రస్తుతం కరోనా నిబంధనల మధ్య ఉత్సవాలలో ఎలా పాలుపంచుకోవాలి? ఎంత ఘనంగా వేడుకలు జరుపుకోవాలి? వంటి ప్రశ్నలు గురువుగారి ప్రేమను అనుభవించిన ప్రతి గురుబంధువుకు కలగడం సహజం.

ఈ పదేళ్ళ మైలురాయి బాబా, గురువుగారి పట్ల మన ప్రేమకు, మనలో వచ్చిన పరివర్తనకు ఒక గీటురాయి కావాలి. మనం కేవలం సాయిపథం సభ్యులం కాదు. గురువుగారు ఆశించిన నిజమైన సాయపథగాములమవ్వాలి. మనస్పర్థలు మాసిపోవాలి, కలతలు సమసిపోవాలి, ప్రేమలు పొంగిపొరలాలి. చేయిచేయి పట్టుకుని సాయి ప్రేమను పొందుతూ, ఆ ప్రేమను పంచుతూ, సాయిపథం ప్రేమపథమని, ఆనందపథమని ప్రపంచానికి చాటిచెప్పాలి - కాదు, మన అచరణే ప్రపంచానికి ఆదర్శమవ్వాలి. అదే మనం గురువుగారికి అందించే కృతజ్ఞతాంజలి! ఆ ప్రేమ మూర్తికి అర్పించే నమస్సుమాంజలి!

***- శ్రీ ఎస్.వి.ఎల్. నారాయణరావు, శిరిడీ.***

## మానవత్వమే దైవత్వం - పూర్ణత్వం

ఆరు సంవత్సరాల వయసులో బాబా చిత్రపటాన్ని చూచి ఎవరో కూడా తెలియక పోయినా వారి రూపంపట్ల ఆకర్షితుడనై బాబా మందిరానికి పోయి వారి చిత్రపటాన్ని చూస్తూ గడిపేవాడిని. పదహారు సంవత్సరాల వరకు వారి చరిత్ర తెలియదు. హైదరాబాదులో మెడిసిన్ చదువుకునేటపుడు సి. హెచ్.సాంబమూర్తి అనే వ్యక్తివలన, గురువుగారు-బాబా పరిచయం కావడం, ప్రతి గురువారం సత్సంగానికి పోవడం వారితో కలసి 1974లో నా 20వ సంవత్సరం శిరిడీకి పోవడం జరిగింది. అప్పటి నుండి నేను సాయిసచ్చరిత్ర చదవడం మొదలైంది. 1976లో విద్యానగర్‌లో ఉద్యోగ నిమిత్తంగా పోవడం, భరద్వాజ మాస్టరుగారిని కలవడం జరిగింది. వారు వ్రాసిన సాయిలీలామృతం చదవడం, ప్రతిరోజూ సత్సంగానికి పోవడం జరుగుతుండేది. 1983 నుండి మన గురువుగారితో ఒంగోలులో కలసి జీవిస్తున్నపుడు ఒకసారి గురువుగారు అడిగారు. మీకు సాయిబాబా అంటే ఎందుకు ఇష్టం అని. దానికి సమాధానంగా నా చిన్నప్పటి నుండి బాబాతో నా అనుబంధం, అనుభవాలు, బాబా చరిత్రద్వారా నాకు తెలిసిన బాబాతత్త్వం దాదాపు





అరగంట సేపు చెప్పడం జరిగింది. సాయిబాబా వారు నన్ను నిరంతరం కాపాడుతున్నారని, ఏది కోరినా తక్షణమే నెరవేరుస్తున్నారని సకల దేవతలు, సకల మహాత్ములు తమ రూపంగా దర్శనం ఇచ్చారని, సకల జీవులలో అంతర్యామిగా వారే ఉన్నారని, ఎందరికో అనుభవాలిచ్చారని, పటం రూపంలో కూడా వారే ఉన్నట్లు నిరూపణ ఇచ్చారని చెప్పాను. భగవంతుని గుణాలైన సర్వజ్ఞత్వం, సర్వవ్యాపకత్వం, సర్వశక్తిమత్వం సాయిబాబా లోపల పూర్ణంగా ప్రకటితమవుతున్నాయని. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సృష్టి, స్థితి, లయలకు అతీతంగా ఉండే పరబ్రహ్మతత్వమే సాయినాథుడిగా అవతరించిందని, సాయిబాబా సద్గురువేకాదు, సమర్ధ సద్గురువని, సద్గురు సామ్రాట్ అని నేను చదివిన పరిజ్ఞానంతో గురువుగారికి చెప్పి నాకు బాహ్యమైన రక్షణను, అంతరంగంలో ఆనందాన్ని ఇచ్చే సద్గురురూపం సాయిబాబా వారని చెప్పాను. నేను చెప్పేటపుడు ఒక్కో వాక్యం అయిన తరువాత ఇంకా ఇంకా అని అడుగుతూనే ఉన్నారు గురువుగారు. నాలో సాయిబాబా వారి గురించిన విషయాలన్నీ అయిపోయాయి. మనస్సు ఖాళీ అయిపోయింది. ఒక నిమిషం మౌనం తరువాత గురువుగారిని మీకు సాయిబాబా వారంటే ఎందుకు ఇష్టం అని నేను అడిగాను.

గురువుగారు ఒక్కసారి కళ్ళు మూసుకొని పెద్ద నిట్టూర్పు విడిచి బాబా దేవుడు అయినా కాకపోయినా, వారు నాకు రక్షణ ఇచ్చినా ఇవ్వకపోయినా, నాకు ఆనందం ఇచ్చినా ఇవ్వకపోయినా, సరే నాకు బాబా అంటే ఇష్టం. ఎందుకు ఇష్టం అంటే మనలాగా మనిషిగా పుట్టి పరిపూర్ణ మానవత్వంతో సాటి మనిషికి పూర్తిగా ఉపయోగపడటమే బాబా జీవితం. ఇతరులకు ఉపయోగపడే 'వారి' తత్త్వం నాకు స్ఫూర్తి. బాబా వారు జీవించిన దాంట్లో వెయ్యో వంతు నేను జీవించగలిగినా నా జన్మ ధన్యం అన్నారు. గురువుగారు **"శ్రీసాయిబాబాలో దైవత్వం కన్నా మానవత్వానికే పెద్దపీట వేసారనిపించింది"**. అప్పటి నుండి సాయిచరిత్రను ఆ కోణంలో చదవడం మొదలుపెట్టి "మనిషిగా పుట్టినందుకు కనీస మానవత్వంతో సాటివారికి సాయపడగలగడమే మానవజన్మకు సాఫల్యం" అన్న స్ఫూర్తిని పొందాను. గురువుగారు బుద్ధుని గురించి చెప్పినా, జీసస్ క్రీస్తు గురించి చెప్పినా, గాంధీ మహాత్ముని గురించి చెప్పినా వాళ్ళలోని మానవత్వాన్ని, సాటి మనిషిని వాళ్ళు ఎలా ప్రేమిస్తున్నారో అన్న ప్రేమతత్వాన్ని ఎంతో ఎమోషన్‌తో నా హృదయానికి హత్తుకునేలాగా చెప్పేవారు. ఒక సత్సంగంలో **"మనిషిగా మానవత్వంతో ఎదగండయ్యా. మిమ్మల్ని దైవం చేసే బాధ్యత నాది"** అన్నారు. "చిన్నప్పటి నుండి తనకు వివేకానందస్వామి ఆదర్శం" అని అన్నారు గురువుగారు. వివేకానందస్వామి చరిత్ర చదివితే

**స్వామివారి సేవాభావం** వలననే గురూజీకి స్వామి అంటే ఇష్టం అనిపించిది. యూత్ అందరికీ వివేకానందస్వామి చరిత్రను చదవమని చెప్పారు అంటే ఫండమెంటల్‌గా ప్రతివాళ్ళు వివేకానందస్వామి స్ఫూర్తితో జీవితం గడపాలని బోధిస్తున్నారని నాకు అర్థమయింది. **అందుకని వివేకానందస్వామి చరిత్ర ప్రాథమిక బడి అయితే రామకృష్ణ పరమహంస చరిత్ర హైస్కూల్ అయితే, రమణమహర్షి చరిత్ర కాలేజీ అయితే సాయిబాబా చరిత్ర పి.జి. అని నా భావం.** ఆ విధంగా చదివిన నేను సాయినాథుని అర్థం చేసుకోగలిగాను. ఆ విధంగా చదివి ఆకళింపు చేసుకోవడానికి స్ఫూర్తి గురువుగారే. నోటితో ఈ చరిత్రలను చదవండి అని చెప్పకుండా వివేకానందస్వామి చరిత్రను మాత్రం చదవమన్నారు. నేను క్రమక్రమంగా మిగిలిన మహాత్ముల చరిత్రలు చదువుతూ వాటి ద్వారా మానవత్వాన్ని పెంచుకుంటూ, సాయిబాబావారికి దగ్గరవ్వడానికి ప్రయత్నిస్తున్నాను. ఇదంతా కేవలం గురువుగారి కృప, సాయినాథుని అనుగ్రహం అని నేను నమ్ముతున్నాను. **- డా॥శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు**

## ప్రేమపథంలో దశాబ్ది ఆరాధనోత్సవం

మహాత్ములు దేహానికి పరిమితమై ఉండరు. సదా సర్వత్రా నిండిన చైతన్యమై ప్రకాశిస్తూ, సర్వజీవుల్లో వశిస్తూ, తమలో భాగమైన ఈ జగత్తుకు ఆనందాన్ని ప్రసాదిస్తూ ఉంటారు. ఈ ప్రపంచానికి దిశానిర్దేశం చేయవలసి వచ్చినప్పుడు దేహధారియై ఈ భువిపై ఆవిర్భవించి తమ అవతారకార్యం నిర్వర్తిస్తారు. అయితే ఆ అవతారకార్యం మహాత్ముల దేహత్యాగంతో ఆగదు. శ్రీబాబూజీ మాటల్లో చెప్పాలంటే **"మహాత్ములు సమాధి చెందిన రోజు దేహ పరిమితులను, అవధులను విడిచి వారి మహిమ, అవతారకార్యం మరింతగా విస్తృతం కావడానికి ఆరంభమయిన రోజు–మరో గొప్ప ఆరంభానికి పుట్టినరోజు. అందుకే మహాత్ముల మహాసమాధి చెందిన రోజును సంతాపదినంగా కాక ఉత్సవంలా జరుపుకుంటాము".** మహామహితాత్ములైన శ్రీబాబూజీ నాడైనా, నేడైనా దేహబద్ధులు కారు. దేహపరిమితులను అధిగమించి సర్వత్రా నిండిన శ్రీసాయిబాబాతో మమేకమై ఉన్నారు. ఆ రూపం మన కన్నుల ముందు నుండి అంతర్ధానమయినా మన హృదయమందిరంలో దీపమై, మన ఆనందంలో ఆనందస్వరూపమై వెలుగొందుతోంది.

శ్రీబాబూజీ నవంబర్ 13, 2010 నాడు మహాసమాధి చెందారు. వారు మహాసమాధి చెంది అప్పుడే దశాబ్దం అయినా, వారి ప్రేమానుగ్రహం భక్తులకు మరింతగా అనుభవమవుతూనే ఉంది. వారి సత్సంగభాషణలు సుజ్ఞానదీపికలై భక్తులకు సరియైన





మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయి. వారి మహిమ, మహత్యం అవధులు లేని ఆకాశంలా ప్రకటమవుతూనే ఉన్నాయి. వారి సన్నిధానం ప్రేమధామమై విరాజిల్లుతోంది. నాడు రెప్పవాల్చకుండా కనులారా  ఆ మహాత్ముని దర్శించి, తరించిన ఆ కన్నులలో ఆ రూపం నేటికి కదలాడుతూనే ఉంది. కనురెప్పలమాటున అలనాటి మధుర, మనోహర, మనోజ్ఞ జ్ఞాపకాలు అలరారుతూనే ఉన్నాయి. ఆ మహనీయుని చిరుదరహాస చంద్రికలు భక్తుల పెదవులపై నవ్వులై ప్రకాశిస్తున్నాయి. నాడు వారి పదములు తాకి పరవశించిన హృదయాలు నేడు వారి చరణాలను ప్రతిష్టించుకొని అర్చిస్తున్నాయి. ఆ కరుణా కటాక్ష వీక్షణాలు అనుగ్రహధారలై కురుస్తున్నాయి. ఆ సత్సంగాలతో విప్పారిన సుజ్ఞానసుమాలు పరిమళిస్తూనే ఉన్నాయి. శ్రీసాయిని ఎలుగెత్తి పిలుస్తూ భక్తుల హృదయ నినాదమై పల్లవించిన సాయిబాబా నామస్మరణ భక్తుల గుండె చప్పుడై ప్రతిధ్వనిస్తూనే ఉంది. వారు ప్రజ్వలింపజేసిన సత్సంగధుని నిరంతరం వెలుగుతూ అజ్ఞాన అంధకారాన్ని పోగొడుతూనే ఉంది. వారి ప్రేమతో విప్పారిన మనస్సులు పువ్వులై ఆ ప్రేమను పరిమళిస్తున్నాయి. ఆ అనుభవాలు అనంతాలు. ఆ ఆనంద అనుభవ పరవశంతో, గగన దిగంతాలలో ప్రతిధ్వనించేలా వారి మహిమను కీర్తిస్తున్న భక్తుల హృదయ నినాదాలు, అనుగ్రహ నిధానాలు. అంతటి ప్రేమను పంచిన శ్రీబాబూజీ అసలెవరో తెలుసుకొని ఆరాధనా సుమాలతో అర్చిద్దాం.

**భగవతత్త్వం :** “మీరందరూ నాలో ఒక భాగమే అనిస్తుంది. మిమ్మల్ని నాలో కలుపుకోవాలని ఉంటుంది”– ఇది 1990వ దశకం ప్రథమార్థంలో పూజ్యశ్రీసాయినాథుని శరత్‌బాబూజీ వారికి అనుంగుభక్తులు, గణితశాస్త్ర ఆచార్యులు శ్రీ పి. సాయిప్రసాద్ గారికి వ్రాసిన లేఖలోని ఒక వాక్యం. శ్రీబాబూజీ అంటే ఎవరు? వారు పొందిన స్థితి ఏమిటి? ఏ రక్తసంబంధం లేకపోయినా వారికి మన మీద ఎందుకంత ప్రేమ? మనకి వారి పట్ల ఎందుకింత ఆరాధన కలుగుతోంది? ఇలాంటి అశేష ప్రశ్నలకు ఆ లేఖలోని ఆ ఒక్క వాక్యంతో సమాధానం దొరుకుతుంది. తమ స్థితి గురించి ఎప్పుడూ బయటకు చెప్పని శ్రీబాబూజీ తమకు కలిగిన అనుభవాన్ని ఆ లేఖలో పంచుకున్నారు. శ్రీబాబూజీ మహోన్నత స్థితి ఏమిటో తెలియజేసిన ఆ లేఖలోని ప్రతి వాక్యం అక్షరసత్యమని భక్తులకు అనతికాలంలోనే అనుభవమయింది.

తల్లి ప్రసవించగానే తన బిడ్డను చూసిన మొదటి చూపులో.. ఆ బిడ్డ నాలోని భాగం అన్న మధురానుభూతి ఆ తల్లికి క్షణకాలం కలుగుతుంది. కాలగమనంలో ఆ భావన క్రమేణ సన్నగిల్లుతుంది.

కాని భగవత్స్వరూపులైన మహాత్ములకు ఈ విశ్వంలోని అణువణువు తమలో భాగమే అన్న అనుభవం ప్రతిక్షణం ఉంటుందంటారు శ్రీబాబూజీ. "నేను సర్వత్రా, సర్వజీవులలో ఉన్నాను." "మీరు చూసేదంతా కలిపి నేనే" అన్నది బాబా అనుభవం. ఛాన్దోగ్యోపనిషత్‌లో "సర్వం ఖల్విదం బ్రహ్మ అంటే ఇదంతా బ్రహ్మమే" అని భగవతత్త్వాన్ని వర్ణించారు. అంతటా అన్నింటా ఉన్నది ఆ చైతన్యమే అయినా అది ఎలా ఉంటుందో మనకు అవగతం కాదు. అయితే బాబా తమ లీలల ద్వారా, అగాధచర్యల ద్వారా అన్నిరూపాలలోను, అంతటా తామే ఉన్నామని అనేక నిదర్శనాపూర్వక అనుభవాలనిచ్చి, ఈ విశ్వమంతా తమలో భాగమే అని ఆ భగవతత్త్వాన్ని దర్శింపజేశారు. ఆ భగవతత్త్వం శ్రీబాబూజీ లేఖలో ప్రస్తావించిన అంశాలలోను ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. శాస్త్రాలలో, గ్రంథాలలో భగవంతుని వర్ణన ఎలా ఉన్నదో దానికి అద్దం పడుతూ, శ్రీబాబూజీ ప్రసాదించిన అనుభవాలు, వారి జీవితం ఒక తార్కాణమై, వ్యాఖ్యానమై నిలుస్తాయి. విశ్వమంతా నిండిన చైతన్యంతో తాదాత్మ్యం చెంది, వారు అన్న మాటలు నిత్య సత్యమని భక్తులకు అనుభవమవుతూనే ఉన్నాయి.

**భువిపై నడయాడిన దైవం** : పూజ్య శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ ఎందరికో ప్రాణ సమానం. మహోన్నతస్థితి పొంది, సాక్షాత్తూ భగవంతుడైన ఆ మహాత్ముడు మన మధ్య జీవించారు. ఆ భగవంతుడు మన కళ్ల ముందు సాక్షాత్కరించారు. మనలను చూసారు. మనతో మాట్లాడారు. మన కష్టాలకు, బాధలకు, సమస్యలకు, అవసరాలకు, కోరికలకు స్పందించారు. తమ ప్రేమతో ఎందరో జీవితాలకు పరిపూర్ణతను ప్రసాదించారు. సుజ్ఞానాన్ని పంచి మన భావాలను సుసంపన్నం చేసారు. అలా వారి సన్నిధికి వచ్చిన వారెవరూ వట్టి చేతులతో తిరిగి పోలేదు. శ్రీబాబూజీ ఒక మాట అంటే అది జరిగి తీరేది. వారి చూపు తాకిన చాలు ఆనంద మనో కలువలు విప్పారేవి. అనునయిస్తూ చెప్పే ఒక్క మాటతోనే మనకు కావలసినవి జరిగిపోయేవి. కొండంత ధైర్యం వచ్చేది. అపార రక్షణ అనుభవమయ్యేది. వారి సన్నిధిలో మనస్సులోని అలజడులు సమిసిపోయేవి. నిశ్చలత్త్వం, ప్రశాంతత అనుభవమయ్యేవి. మన ఆలోచనలలో, భావనలలో, మనం చేసే పనులలోనూ సమతుల్యతతో పరిపక్వత వచ్చేది. అంతవరకు పీడిస్తున్న సమస్యలు, బాధలు తొలగిపోయేవి.

అదెలా సాధ్యం? భగవంతునిలో ఒక భాగమై ఉండటం మన సహజస్థితి. ఆ సహజత్వానికి దూరమై మరపులోకి జారుకొనే కొలది మనలో అసహజత్వం వస్తుంది. ఆ అసహజత్వం మనస్సును అల్లకల్లోల పరుస్తుంది. ఏదో అభద్రత, వెలితి, వెతలు, మానసిక సంఘర్షణలు. పుట్టినది మొదలు ఆ సహజస్థితి నుండి వేరుపడి, రకరకాల





వెంపర్లాటలతో బాధలు, సమస్యలు కొనితెచ్చుకొని అసహజస్థితికి చేరుకుంటాము. తల్లి స్పర్శ తగలగానే పసిబిడ్డ ఏడుపు మానినట్లు, దైవసన్నిధిలో ఉన్నప్పుడు లేదా భగవన్నామస్మరణ చేస్తున్నప్పుడు, భగవంతుని ఊసు–ధ్యాసలలో ఉన్నప్పుడు ఆ అసహజస్థితిలో ఉన్న మనం కొద్దిక్షణాలైనా సహజస్థితికి చేరుకుంటాము. అలా ఆనందస్వరూపులైన భగవంతునిలో భాగమై, లీనమైనప్పుడు మనకు ప్రశాంతత, ఆనందం అనుభవమవుతాయి. శ్రీబాబూజీ సన్నిధిలో భక్తులకు అంతటి ఆనందం, రక్షణ, ప్రశాంతత అనుభవం కావడానికి కారణం వారి సన్నిధిలో అప్రయత్నంగా మనం వారిలో ఒక భాగమై సహజస్థితిని చేరుకోవడమే. అలాంటి సహజస్థితి మనకు కొన్ని క్షణాలు, గంటలు ఉంటే, ఆ స్థితి, అనుభూతి మహాత్ములకు అనుక్షణం ఉంటుంది. కారణం వారు ప్రతిక్షణం ఆ భగవంతునిలో తాదాత్మ్యం చెంది ఉండటమే. కొందరు మహాత్ముల విషయంలో అంతటి అత్యున్నత స్థితి వారి ఉద్ధరణకు ఉపయోగపడితే శ్రీబాబూజీ వంటి మహాత్ములకు ఆ మహోన్నత స్థితి లోకకళ్యాణార్థమై ఈ ప్రపంచానికి ఒక వరమయింది.


మనం వారిలో ఒక భాగమై ఉన్నాం కనుక మనం ఏమనుకున్నా, వాచా చెప్పకపోయినా శ్రీబాబూజీకి తెలిసేది. ఒక భక్తుడు అబద్ధం చెప్పడానికి సమాయత్తం కాగానే, వారిని హెచ్చరిస్తూ శ్రీబాబూజీ, “మీరు అబద్ధం చెప్పకండి. నేను మీ ఆలోచన ఉద్భవించే చోటు (సోర్స్ ఆఫ్ థాట్) లో ఉన్నాను” అన్నారు. శ్రీబాబూజీ పటానికి చెప్పుకున్నా భక్తులు కలసినప్పుడు వాటికి వాచా సమాధానం చెప్పారు. గురుస్థాన్‌లో బాబాకు నివేదించుకొని శ్రీబాబూజీ చెంతకు వచ్చినప్పుడు, ఇక్కడ ఏమీ చెప్పకుండానే వెనువెంటనే స్పందించి భక్తుని అవసరాన్ని తీర్చారు. వారికి నివేదించుకోగానే అంతవరకు ఉన్న అడ్డంకులు తొలగిపోయి, చుట్టూ ఉన్న మనుషులు, పరిసరాలు, ప్రకృతి అంతా అనుకూలంగా మారిపోయేవి. వారి రాకకు ప్రకృతి పరవశించేది. భగవంతుని గుణగణాలైన సర్వజ్ఞత, సర్వవ్యాపకత్వం, సర్వశక్తిమత్త్వం, అంతర్యామిత్వం – ఇవన్నీ శ్రీబాబూజీ ప్రతిస్పందనలో అనుభవమవుతాయి. ఇలాంటి ఎన్నో అనుభవాలు క్రోడీకరిస్తే, భగవంతుడు అనడానికి ఏవైతే గుణగణాలు, కొలమానాలు, నిర్వచనాలు ఉన్నాయో అవి శ్రీబాబూజీ తత్త్వానికి సంపూర్ణంగా సరిపోతాయని అవగతమవుతుంది.

**ప్రేమతత్త్వ మహత్త్వం :** మానవమాత్రులైన వారికి ఇదంతా ఎలా సాధ్యమవుతుంది ? తమలోని వెలితిని పోగొట్టుకునేందుకు శ్రీబాబూజీ సాగించిన అన్వేషణ, అకుంఠిత దీక్షగా చేసిన కఠోర సాధనలు, అపారజ్ఞానసముపార్జన – ఇవన్నీ వారిని శ్రీసాయిబాబా వైపుకు నడిపించాయి. తమలోని వెలితిని

పోగొట్టే ఆనందనిధి శ్రీసాయిసన్నిధే అని గుర్తించారు. శ్రీసాయిబాబా చిత్రపటాన్ని చిన్నతనంలో మొదటసారి చూసిన ఆ క్షణం వారికి కలిగిన సహజాతి సహజమైన ప్రేమ క్రమంగా మహావృక్షమై ఎదిగింది. ఆ ప్రేమతోనే బాబా గురించి సమస్తం తెలుసుకునేందుకు ఒక తపస్సులా లక్ష్యశుద్ధితో తపించారు. అగాధమైన బాబాతత్త్వాన్ని మథించి, జ్ఞానరత్నాలను సముపార్జించారు. బాబాపట్ల ఉన్న అపారమైన ప్రేమతో బాబాప్రబోధాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించి బాబాకు తగ్గ బిడ్డ అయ్యారు. బాబాకు దగ్గరై బాబా స్వరూపులయ్యారు. బాబాకు దగ్గరవడం అంటే ఏమిటి? అన్న ప్రశ్నకు "మనమంటూ లేకుండా బాబానే ఉండటం. అదీ నిజంగా బాబాకు దగ్గరవడం అంటే. ఎంత దగ్గరంటే ఇక దగ్గర, దూరము రెండు అనేటువంటివి లేకుండా పోయేంతవరకు. అంత దగ్గర కావాలి. మనమంటూ లేకుండా బాబానే మిగలాలి–అంతగా! మనలో ప్రేమ అనే అనుభవం కలిగినప్పుడు ఇద్దరు ఒక్కటి కావడం జరుగుతుంది. ప్రేమ యొక్క తత్త్వం ఏమిటి అంటే రెండింటిని ఏకం చేయడం" అని శ్రీబాబూజీ వివరించారు. అలా బాబాను అనన్యంగా ప్రేమించి, తాము లేకుండా, తాము అన్న అస్తిత్వమే లేకుండా ఆనంద స్వరూపులైన బాబాతో ఏకమై, మమేకమై, సదా తాదాత్మ్యం చెంది ఆ ఆనందస్వరూపానికి, ప్రేమతత్త్వానికి శ్రీబాబూజీ ప్రతిరూపమయ్యారు, సర్వత్రా ఉండి, సర్వజీవస్వరూపం తామే అయిన బాబాతో మమేకమైన శ్రీబాబూజీకి చరాచర సృష్టి, జగత్తు అంతా తమలో భాగంగా భాసిల్లింది.

నది సముద్రంలో ఒక వైపు సంగమిస్తూనే మరోవైపు ఆ పరివాహక ప్రాంత అవసరాలు తీరుస్తుంది. అలానే శ్రీబాబూజీ అనే మహా జీవనది ఆనంద సాగరమైన బాబాతో ఒకవైపు తాదాత్మ్యం చెంది ఉంటూనే, మరోవైపు అహం అణిగిన పల్లపు ప్రాంతాలకు ప్రవహిస్తూ, ఆధ్యాత్మిక క్షేత్రాలను సస్యశ్యామలం చేస్తూ, ఆ ప్రవాహాన్ని నింపుకున్న వారికి ఒక ఆలవాలమై జీవంపోస్తూ, ప్రేమ దాహార్తిని తీర్చారు. తమలో భాగమైన మనందరిని ఆనందంగా ఉంచడానికి సర్వం తామై, మన బాగోగులు చూస్తూ, వ్యధలకు స్పందిస్తూ, ప్రేమను పంచుతూ, పెంపొందిస్తూ, మనం వారికి చెందిన వారిమని, వారిలో భాగమే అన్న గుర్తింపు తెస్తూ మనలను ఉద్ధరిస్తున్నారు శ్రీబాబూజీ.

"ఏకం ఏవద్వితీయం" అన్నది భగవత్ స్వరూపాన్ని వర్ణించే శాస్త్రవాక్యం. అంటే రెండు లేవు ఉన్నది ఆ ఒక్కటే అని అర్థం. ఆ ఒక్కటిలో ఏకం కావడానికి మనకు శ్రీబాబూజీ సూచించిన మార్గాలు – ప్రేమను అనుభవించడం, ఆ ప్రేమను వ్యక్తీకరించడం. ఏ సాధనల అంతిమ లక్ష్యం అయినా అదే కావాలని ఉద్బోధించారు.





అందుకు మనం ఏమి చేయాలి? మన జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలి? అందుకు సమాధానం శ్రీబాబూజీ అభయం.

**శ్రీబాబూజీ అభయం :** "హ్యాపీగా బాబాను పట్టుకోండి. బాబాను చూపించాను. బాబాతత్త్వమేమిటో చెప్పాను, పట్టుకోండి. మిమ్మల్ని ఎలా తీసుకుపోవాలో నాకు తెలుసు. చక్కగా ఉండండి. మీకేమి లోటు రాదు. నేను చెపుతున్నాను కదా! ఆ అస్యూరెన్స్ కూడా నేను ఇస్తున్నా, మీకెందుకు! చక్కగా బాబా మీద ఫోకస్ చేయండి. అయితే, ఆ అస్యూరెన్స్ మీరు నాకివ్వాలి. బాబా, బాబా, బాబా అంతే వేరే అయితే ఏదీ ఉండకూడదు మనసులో, లైఫ్ అంతా కూడాను, మన జీవితంలో బాబా యొక్క సత్సంగము అనేటు వంటిది ఒక భాగం కావడం కాదు. బాబా యొక్క లీలా ప్రబోధానికి మన జీవితమే ఒక భాగం కావాలి. అలా ప్రయత్నం చేయండి బాబా చూసుకుంటారు" అని అభయమిచ్చారు శ్రీబాబూజీ. మనకు ఎంతో భరోసా ఇచ్చారు. ఏమి చేయాలో చెప్పారు. వారు చెప్పినట్లు చేస్తే ఏ లోటు లేకుండా, బిడ్డను చేయి పట్టుకొని ఎలా ముందుకు నడిపిస్తారో, అలా మనందరిని నడిపిస్తానని వాగ్దానమిచ్చారు. వాగ్దానం ఇవ్వడమే కాదు. ఇప్పటికీ ఆ వాగ్దానాన్ని నెరవేరుస్తున్నారు.

శ్రీబాబూజీ ప్రబోధానికి అనుగుణంగా మన జీవితాలను తీర్చిదిద్దుకొని, ఆచరణలో పెట్టినప్పుడే అది నిజమైన ఆరాధన. శ్రీబాబూజీ సత్సంగభాషణలు వింటూ, వాటికి ఆచరణ రూపునిస్తూ, అనుభవాలను గుర్తిస్తూ, మనం ఆ ప్రేమఒడిలో ఎప్పుడూ ఆనందంగా తరిద్దాం. ఓ మహాత్మా! సద్గురుదేవా! మా ప్రాణానికి ప్రాణమా! మా సర్వమా! మా దైవమా! మీ దివ్యదర్శనాన్ని అనుగ్రహించు. మీ దివ్యసాన్నిధ్యాన్ని ప్రసాదించు. మీ ప్రేమవాహినిలో ఓలలాడించు. మీలో మేమూ ఒక భాగమే అన్న గుర్తింపు ప్రసాదించి తరింపచేయండి. మీ ప్రేమకై సాగే ఈ ఆరాధనలో ఆనంద దీపకాంతులతో మా మనస్సులు ప్రకాశించాలని ప్రార్థిస్తూ ...

**– ఉపేంద్ర, చెన్నై**


**అమృతపానమైన సద్గురు ప్రేమాక్షర నివేదన అప్రతిహతంగా, ఆనందసంద్రంగా రెండు దశాబ్దాలకు పైగా కేవలం 'గురుకృప'తో సాగుతోంది. గురుబంధువులు వారికి పూజ్య గురుదేవులతో ఉన్న అనుభవాలను, అనుభూతులను, పరవశ, పరిణతలను పంచుకొమ్మని వినయపూర్వకంగా విన్నవిస్తోంది గురుకృప పత్రిక. ఇవిగో పంచుకోవడానికి మాధ్యమాలు.**

**Ph : 83672 00045** **Whats App : 83672 00045**

**E-mail : gurukrupa@saimail.com** **Website : gurukrupa.info**

# నిరంతర ప్రవాహం



ఈ క్రింది సంభాషణలు శ్రీబాబూజీ గంగానదీ తీరంలో ఉన్నప్పుడు 2006 మరియు 2007 సంవత్సరాలలో జరిగిన సత్సంగాలలో చోటుచేసుకున్నాయి.

**భక్తుడు :** గురువుగారూ! విషయాలలోని సూక్ష్మతత్వాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి మేము సున్నితత్వాన్ని పెంపొందించుకోవడం ముఖ్యమనిపిస్తోంది. సున్నితత్వమనేది హృదయ వికాసం చెందేటందుకు ముందుగా ఎంతో అవసరమని, అంతేకాకుండా ఆ వికాసం వలన సున్నితత్వం కలుగుతుందనీ అనిపిస్తోంది.

**గురువుగారు :** మనం మన అవసరాలపట్ల, మన స్వప్రయోజనాల పట్ల సున్నితంగానే ఉంటాం, కానీ ఇతరుల అవసరాల విషయానికి వచ్చేటప్పటికి అలా ఉండం. నలుగురితో కలసి సమిష్టిగా చేసే పనులు – ఉదాహరణకు గ్రూప్ ప్రాజెక్టు లేదా సత్సంగం – మొదలైన వాటిలో పాలుపంచుకోవడం ద్వారా సున్నితత్వాన్ని అలవర్చుకోవచ్చు. సత్సంగంలో నేను మాట్లాడుతున్నప్పుడు మీరు శ్రద్ధగా వింటున్నారు. మీ ఇంద్రియాలు ఎంతో సునిశితంగా, సున్నితంగా పనిచేస్తున్నాయి. మీరు మీ ఇంద్రియాల (Senses) సామర్థ్యాన్ని (Ability) పెంచుతున్నారు. సమర్థవంతమైన సున్నితమైన ఇంద్రియాలు ఉండటమంటే మీరు సున్నితమైన మనుషులు (Sensible) అనే కదా అర్థం. అంతే కదా? (నవ్వులు...) అప్పుడు బుద్ధుడి అష్టాంగమార్గంలోని అన్ని లక్షణాలు – సమ్యక్ దృష్టి, సమ్యక్ వాక్కు మొదలైనవన్నీ మనకు ప్రాప్తిస్తాయి. ఆ స్థితిలో మన ఇంద్రియాలు మనలో అంతర్గతంగా ఉన్నదానికి అడ్డురాకుండా పనిచేస్తాయి. అంతేకాకుండా అవి మనలోని చైతన్య ప్రవాహం పట్ల, ఆధ్యాత్మికమైన ఉనికి పట్ల సున్నితంగా మారుతాయి. మీరిప్పుడు మీ ఉనికిని గుర్తించలేకపోవచ్చు. కానీ మీరు జీవితంలోని మిగతా విషయాలలో సున్నితంగా ఉంటే, మీలో అంతర్గతంగా ఉండే ఆ (చైతన్య) ప్రవాహం పట్ల కూడా సున్నితంగా తయారవుతారు. అది మీ అనుభవంలోకి రావడం ప్రారంభమవుతుంది. మీరు సున్నితత్వాన్ని పెంపొందించుకుంటే మీరు ప్రతిచోటా ఈ ప్రవాహమనే సూత్రాన్ని చూడగలుగుతారు, అనుభవించగలుగుతారు. ఆ ప్రవాహం మీలో లేదా? మీలో రక్తం ప్రవహించడం లేదా? ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో గాలి ప్రవాహం లేదా? నా మాటలు ప్రవాహరూపాలే





కదా! ప్రవాహం లేనిదెక్కడ? ప్రతి దగ్గరా ఓ ప్రవాహం – గతి, వేగం, నిరంతర మార్పు ఉంటుంది. మీరు సున్నితంగా మారే కొద్దీ ఈ ప్రవాహాలన్నింటికీ మూలమైన ఆ చైతన్య ప్రవాహాన్ని కూడా గుర్తించగలిగే సున్నితత్వాన్ని మీరు పొందగలరు.

**భక్తుడు :** గురువు గారూ! అటువంటి సున్నితత్వాన్ని పెంపొందించుకోవడం ఎలా?

**గురువుగారు :** ముందుగా మీరు విచక్షణారాహిత్యంగానూ, మొద్దుబారినట్లుగానూ లేకుండా ఉండటానికి ప్రయత్నించండి. మీ జీవితంలోని పరిస్థితులలో, మీ చుట్టూ ఉన్న వాతావరణంలో, ప్రవర్తనలో, ఇలా అన్ని విషయాలలో సున్నితంగా ఉండటానికి ప్రయత్నించండి. అప్పుడు సున్నితత్వం పెరుగుతుంది. ఆ సున్నితత్వం క్రమంగా పెరిగి మీరు అతి సున్నితంగా మారుతారు.

**భక్తుడు :** గురువుగారూ! నేను గంగా ప్రవాహాన్ని చూస్తూ గంటల తరబడి కూర్చోగలుగుతున్నాను. ఎంతకీ విసుగు పుట్టడంలేదు. ఆ ప్రవాహం ఎందుకని అంతగా ఆకట్టుకుంది?

**గురువుగారు :** నదీప్రవాహమైనా, మరే ప్రవాహమైనా దానిని చూసి అందరూ అంతగా ముగ్ధులవ్వడానికి కారణం మనం దానిని చూసినప్పుడు ఆ ప్రవాహతత్వాన్ని (సూత్రాన్ని) అనుభూతి చెందడమే. మనం ప్రవహిస్తున్న నీటిని చూసినపుడు మనకు తెలియకుండానే మనం ఆ ప్రవాహంతో తాదాత్మ్యం చెందుతాము. మనల్ని కట్టిపడేసేది ఆ ప్రవాహం కాదు. ప్రవహించేటటువంటి తత్వం. ఒక బ్రిడ్జి మీద నిలబడి క్రింద ప్రవహించే నదిని చూడండి. ఆ ప్రవాహరూపంలో మార్పేమీ ఉండదు, కానీ ఎంతసేపు దానిని చూసినా మనకు బోరుకొట్టదు. అందులో విసుగు ఉండదు. ఎందుకని? మనం అలా చూడటం మొదలుపెట్టిన కాసేపటి తరువాత మన మనస్సు మనం నదిని చూస్తున్నామని, నీళ్ళు ప్రవహిస్తున్నాయని మర్చిపోతుంది – ఆ ప్రవాహాన్ని అనుభూతి చెందుతూ ఉంటుంది. ఆ ప్రవాహతత్వంతో మనస్సు కలసి దానితో తాదాత్మ్యాన్ని పొందుతుంది, దానిలో లీనమవుతుంది. ఈ స్థితిలో మీకు కలిగిన అనుభవాన్ని ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో ఆధ్యాత్మికానుభవం అంటారు. దాని వెనుకగల సూత్రం – ప్రవాహతత్వం, ప్రవహించేతత్వం. ప్రతిదీ ఎంతో వేగంగా కదలిపోతూ ఉండటం వలన అది అంతా మనకు ఒక్కటిగా కనిపిస్తుంది. ఉదాహరణకు సినిమా ఫిల్మును తీసుకోండి. ప్రొజెక్టరు ముందు ప్రతి ఫ్రేము ఎంతో వేగంగా తిరుగుతూ ఉండటం వలన తెరమీద చూసినపుడు ఒక దృశ్యంలా కనిపిస్తుంది. ప్రతి ఫ్రేము వేగంగా మారిపోతూ ఉంటుంది, సెకనుకు 24 ఫ్రేములు అలా వెళ్ళడం వలన మనకది కళ్ళముందు జరుగుతున్న దృశ్యంలా ఉంటుంది. అలా విడివిడి ఫ్రేములను ఒక దృశ్యంగా (సినిమాగా) చేసేది

ఏమిటి? ఆ ఫ్రేములను కలిపేది ఏమిటి? ఆ లింకును, వాటిని అలా కలిపి ఒక దృశ్యంలా మార్చేదానిని విభిన్న ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో వివిధ రకాల పేర్లు పెట్టి రకరకాలుగా వివరించి చెప్పారు. కొందరు దానిని ఆత్మ అన్నారు. అది జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థలను నిరంతరం అనుసంధానించేదిగా ఉంటుంది. ఆ అనుభవానికి నాకు దగ్గరగా అనిపించే అనుభవం, ప్రవహించే నదిని చూస్తూ ఉండటం. అది మనకు గతి సూత్రాన్ని, ప్రవాహతత్వాన్ని తెలియజేస్తుంది.

**భక్తుడు :** గురువుగారూ! ఒక్క ఫ్రేమును, ఆ ఒక్క ఫ్రేమును అనుభవంలోకి తెచ్చుకోవడం సాధ్యమవుతుందా?

**గురువుగారు :** దానివల్ల ప్రయోజనం లేదు. ఇది మానసిక విశ్లేషణ కంటే భిన్నమైనది. మానసిక విశ్లేషకులు ఒక్కో ఫ్రేమును కత్తిరించి చూడాలనుకుంటారు. అలా కాకుండా ఆ ఇరవై నాలుగు ఫ్రేములను మీరు ఒక్కటిగా భ్రమపడినా తప్పే. అదీ వాస్తవం కాదు. ఆ ఫ్రేములను కలుపుతూ సినిమాను వాస్తవంగా మనకు అనుభవమయ్యేలా చేస్తున్న ఆ సూత్రాన్ని పట్టుకోగలగాలి. అన్ని ఆధ్యాత్మిక సాంప్రదాయాల గమ్యం అదే. మనం దానిని అప్పుడప్పుడూ అనుభూతి చెందుతూ ఉంటాం. ఉదాహరణకు, ఒక ప్రవాహాన్ని చూస్తేనో, విమానంలో ప్రయాణించినపుడో మనకు ఆ అనుభవం కలుగుతుంది. మనం అత్యధిక వేగంతో ప్రయాణించినపుడు ఆ ప్రయాణం మనకు అటువంటి అనుభవాన్ని ఇస్తుంది. దానికి కారణమేమిటంటే మనస్సు ఆ ప్రవాహతత్వంతో, వేగంతో ఒక్కటవుతుంది. మనస్సు శూన్యమవుతుంది. వ్యోమగాముల అనుభవాలు చదవండి. గురుత్వాకర్షణశక్తి లేకపోవడం వలన శరీరం భార రహితంగా తయారవుతుంది. తమ ఆలోచనలు కూడా ఆ స్థిరత్వాన్ని (గురుత్వాకర్షణను) కోల్పోయాయని వారు చెప్పారు.

**భక్తుడు :** మహాత్ములకు ఒక్కో ఫ్రేము మరియు ఇలాంటి ఫ్రేముల వేగంగా కదలడం వల్ల రూపుదిద్దుకునే దృశ్యం ఈ రెండూ ఒకేసారి అనుభవమవుతాయా?

**గురువుగారు :** వాళ్ళు ఆ ప్రవాహం వెనుక గల సూత్రాన్ని అనుభవిస్తూ ఉంటారు.

**భక్తుడు :** ఆ ప్రవాహమే ఆ ఫ్రేములను కలుపుతుందా?

**గురువుగారు :** ఒక విధంగా చెప్పాలంటే నిజమే. అది కేవలం ఫ్రేములను మాత్రమే కలపదు, అది వాటిని కదిలేలా చేసి వాటిని ఒకే దృశ్యంగా మనకు అనుభవమయ్యేలా చేస్తుంది. అది వాటిని కేవలం కలిపి వాటిని కదలకుండా చేస్తే, మీకు కేవలం ఒక్క ఫ్రేమ్ మాత్రమే కనిపిస్తుంది! అది కేవలం దానిని కలిపే శక్తి మాత్రమే కాదు, అది





వాటిని కదిలిస్తుంది. కానీ అది మాత్రం స్థిరంగా ఉంటుంది. అది 'చలం' మరియు 'అ–చలం', 'అరుణాచలం' పేరు వెనుక గల సూత్రం ఇదేనని మీకు ఇంతకుముందు చెప్పినట్లున్నాను. 'అరుణ' అంటే సంస్కృతంలో ఎరుపు అని అర్థం. అది వేడికి చిహ్నం. మీలో ఉద్రేకం, కోపం వచ్చినప్పుడు ముఖం ఎర్రబడటంలాగా లోపల ఏదో చర్య జరుగుతూ ఉంటుంది. అందుకే హిందూమతంలో ఎరుపును కార్యసాధనకు చిహ్నంగా చెప్తుంటారు. అది గతిశీలమైనది. 'అచల' అంటే నిశ్చలం, 'అ–చల'. అది పూర్తిగా అచలమూ కాదు, అలా అని పూర్తిగా చలిస్తూ ఉండదు, వీటికి ఆతీతంగా ఉంటుంది.

**భక్తుడు :** గురువుగారూ! మన చైతన్యం యొక్క స్వభావం క్రియాశీలంగా ఉండటమని చెప్పారు. అంటే దానర్థం అది నిరంతరం మారుతూఉంటుందా?

**గురువుగారు :** అది మారదు. క్రియాశీలంగా ఉండటమంటే మారుతూ ఉండటమని కాదు. అక్కడ ఉత్తేజకరమైన ఆనందానుభూతి ఉంటుంది. అదీ క్రియాశీలంగా ఉండటమంటే.

**భక్తుడు :** అంటే అక్కడ ఒకరకమైన కదలిక ఉంటుంది, నది ప్రవహిస్తున్నట్లుగా?

**గురువుగారు :** నిజమే. అది ఒక రకమైన కదలికలాగా కూడా మనకు అనుభవమవుతుంది. నదిలాగే మన చైతన్యం నిరంతరం చలిస్తూనే ఉంటుంది. అది మనకు నిరంతరాయమైన ఒకే అనుభవంగా అనుభవమవుతుంది. నది మన చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రవహించే నదిని చూసినపుడు అది ఒకే విధంగానే ఉన్నట్లుగా మనకు అనుభవమైనప్పటికీ మన చైతన్యం ఆ కదలికతో (ప్రవాహంతో) మనకు తెలియకుండానే మమేకమవుతుంది. మన చైతన్యం దానితో ఒక్కటవుతుంది. అక్కడ క్రియాశీలత ఉంటుంది.

మన చైతన్యం పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహిస్తున్న నదిలాంటిది. అది ఎక్కడ నుండి వచ్చిందో, ఎక్కడకు వెళుతుందో మనకు తెలియదు. నదిని చూసినపుడు మనకు అదే నీళ్ళు, అదే గంగలా కనిపిస్తుంది. నదిలో ఏదైనా వస్తువు తేలుతుంటే తప్ప నది ప్రవహిస్తున్న సంగతి మనకు తెలియదు. మన జీవితంలో మనకు ఎదురయ్యే వివిధ అనుభవాలు ఇటువంటి వస్తువుల వంటివి. మనం వాటితో తాదాత్మ్యం చెంది వాటితోపాటు కదులుతూ మనం కదులుతున్నామని అనుకుంటూ ఉంటాం. కదిలే వస్తువును కాకుండా మనం ఆ కదలికను పట్టుకోవాలి. ఆ కదలిక పట్ల ఎరుకతో ఉండి దానిని అర్థం చేసుకోండి, దానితో మమేకమవ్వండి. అది మనకు సాధారణంగా అనుభవమయ్యే సాపేక్షమైన చలనంకాదు, అది మరో రకమైనది. దానికి దగ్గరగా నేను చెప్పగలిగిన పోలిక

నదీప్రవాహం. నదీప్రవాహాన్ని చూసేటప్పుడు మన సాపేక్షికమైన అనుభవస్థాయిని దాటిపోయి మనల్ని మనం మర్చిపోతాం. అటువంటి కదలిక పట్ల ఎరుకతో ఉండటం చాలా అరుదుగా జరుగుతుంది. మహాత్ములు ఆ కదలికతో ఎప్పుడూ తాదాత్మ్యం చెంది ఉంటారు. ఈ ప్రపంచాన్నంతా ఇలాంటి నదీ ప్రవాహంగా చూస్తారు.

**భక్తుడు :** ఎటువంటి భావోద్వేగం (ఎమోషన్) లేకుండా?

**గురువుగారు :** అవును. ఎటువంటి భావోద్వేగం లేకుండా.

**భక్తుడు :** కాబట్టి భావోద్వేగం మనల్ని బయటకు తీసుకువచ్చి మన తాదాత్మ్యాన్ని చెదరగొడుతుందా?

**గురువుగారు :** అవును. మనం కేవలం ఒక కదలాడే వస్తువుతో ఒక్కటవుతాం, కానీ ఆ కదలించే తత్వంతో కాదు.

**భక్తుడు :** మేము వస్తు విషయాల కదలికకు కారణమైన దానితో తాదాత్మ్యం చెందడానికి బదులుగా ఆ విషయాలతో తాదాత్మ్యం చెందడం వలన మా ప్రతి అనుభవం చివరకు అసంతృప్తిని మిగిలిస్తోందా? మహాత్ములు విషయాలకు బదులుగా వాటిని కదిలించే దానితో తాదాత్మ్యం చెందుతారా?

**గురువుగారు :** అవును. మహాత్ములు ఆ కదిలించే తత్వంతో తాదాత్మ్యం చెందుతారు. అది చైతన్యానికి సహజమైన లక్షణం. నిజానికి చెప్పాలంటే కేవలం నదులు మాత్రమే కాదు, ప్రతీది సమస్త విశ్వం చలిస్తోంది. ప్రతి ఒక్కటీ చలనంలోనే ఉంది. మహాత్ములు వారెక్కడున్నప్పటికీ దీనిని అనుభవిస్తూ ఉంటారు. ఆయన మొత్తం ప్రపంచాన్ని గంగా ప్రవాహాన్ని చూస్తున్నట్లే చూస్తూ ఉంటారు. అందుకనే ఎక్కడైతే మహాత్ములు ఉంటారో అక్కడ తీర్థం ఉంటుందని శాస్త్రాలు చెబుతాయి. ఆయన ఈ గంగా ప్రవాహతత్వానికి ప్రతీక. సకలతీర్థాలు మహాత్ముని పాదాల చెంతనే ఉంటాయని శాస్త్రాలు పేర్కొంటాయి.

**భక్తుడు :** గురువుగారూ! నేను నిరంతరం ప్రవహించే గంగానదిని చూస్తూ ఉన్నప్పుడు, చైతన్యం యొక్క స్వభావాన్ని ప్రతిబింబించే ఏదో నిశ్చలత్వాన్ని అనుభవిస్తున్నాను. ఆ విధంగా నాలోని భావోద్వేగాలన్నీ సమన్వయపడి ఒక రకమైన శాంతి అనుభవమవుతోంది. మేము టి.వి. చూస్తున్నప్పుడు ఇలాంటి అనుభవం ఎందుకని కలగడంలేదు?

**గురువుగారు :** మీరు టి.వి. చూస్తున్నప్పుడు కొన్ని పాత్రలతో తాదాత్మ్యం చెందుతారు కాబట్టి అలాంటి అనుభవం కలగడంలేదు. మీరు నదీప్రవాహాన్ని చూస్తున్నప్పుడు, మీరు ఆ ప్రవాహంతో ఒక్కటవుతారు, అది మీ స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. టి.వి.





విషయంలో అది మనకు అద్దంలాగా పనిచేయదు. మీరు సినిమా చూస్తున్నప్పుడు మీరు రకరకాల పాత్రలు ధరిస్తారు. దానివల్ల మీలో కొన్ని జ్ఞాపకాలుగానీ లేదా వాటికి సంబంధించిన విషయాలుగానీ గుర్తుకువస్తాయి. సాధారణ జీవితంలోలాగే చైతన్యం తనను తాను కోల్పోయి రకరకాల పాత్రలను ధరిస్తుంది. చాలామంది టి.వి. చూడటానికి కారణం వారికి వారి రోజువారీ జీవితంలో వారికి కావలసినన్ని విభిన్నమైన అనుభవాలు దొరకకపోవడంతో తోచక టి.వి.లు పెట్టుకొని చూస్తుంటారు.

గంగా ప్రవాహాన్ని చూడటం బాబాను చూడటం లాంటిది. ప్రవహించే నదిలాగా సద్గురువు ఎప్పుడూ క్రొత్తగా కనిపిస్తారు. అదే సమయంలో ఆయన రూపం స్థిరంగా ఉంటుంది. ఆయన రూపం ఎంత మనోహరంగా ఉంటుందంటే మనస్సు తనను తాను మర్చిపోయి ఆ రూపంలో లీనమవుతుంది. అది సాధారణంగా మనకు కనిపించే రమణీయత కాదు. ఆయన రూపంలో గంగా ప్రవాహం వంటి క్రియాత్మకమైన సూత్రం ఉంటుంది. కాబట్టి ప్రతిసారీ ఆయన క్రొత్తగా ఉంటారు. మనం ఆయనను చూడటం అదే తొలిసారి అన్నట్లుగా ఉంటుంది. అందువల్ల అది మనల్ని గతకాలపు జ్ఞాపకాలు, భవిష్యత్ ప్రణాళికలు, ఆలోచనలు లేకుండా ఎల్లప్పుడూ వర్తమానంలో ఉండేట్లు చేస్తుంది. ఆయన మీ చైతన్యంలోని క్రియాశీల చలనతత్వాన్ని ప్రతిబింబిస్తారు. మీరు ఆ తత్వంతో ఒక్కటవుతారు.

**గురువుగారు :** బాబా వీచే గాలిలాంటివారు. ఒక గదిలో కిటికీ తలుపులన్నీ వేసేసి గాలి నిశ్చలంగా ఉంటే, మనం, “అసలు గదిలో గాలే లేదు” అంటాము. నిజానికి అది వాస్తవం కాదు, గాలి ఉంది. గాలి అంతా వ్యాపించి ఉంది. కాబట్టే మనం జీవించివున్నాము. మరి గాలి లేదని ఎందుకంటాము? ఎందుకంటే గాలి వీయడం మనకు అనుభవం కావడం లేదు. కాబట్టి మనకు దాదాపు ఊపిరి ఆడనట్లుగా ఉంటుంది. మనం కిటికీ తలుపు తీయగానే గాలి తగులుతుంది. అప్పుడు మనం, “హమ్మయ్య, ఇప్పుడు గాలి వస్తోంది!” అంటాము. గాలి వీయడం అనేది మన ఆత్మ చరించడం వంటిది. ఆ కదలిక లేకపోతే ఆత్మను అనుభూతి చెందటం కష్టం.

**భక్తుడు :** గురువుగారూ! నేను గంగ ఒడ్డున కూర్చున్నప్పుడు నా మనస్సు ప్రశాంతమవుతుంది, ఆలోచనలు కాస్త తగ్గుతాయి. కానీ నేను ఆ ప్రవాహతత్వంతో మమేకం కాలేకపోతున్నాను.

**గురువుగారు :** మనం ఇప్పుడు గంగకు దగ్గరగా ఉన్నాం కాబట్టి నేను నదిని ఉదాహరణగా చెప్పాను. చాలా మందికి అది అలా అనుభవమవుతుంది. అది వారికి ఉపయోగపడవచ్చు. అంతేగానీ ప్రతి

ఒక్కరూ వెళ్ళి దానిని సాధన చెయ్యాలని కాదు. నేను దానిని ఒక సాధనగా చెప్పలేదు. మీలో కొందరికి అటువంటి అనుభవం కలిగింది. కాబట్టి దాని గురించి ప్రస్తావించాను. అది మీకు అలా అనిపించకపోతే ఆ విషయాన్ని వదిలేయండి, మీరు మరో దానిని ఎంచుకోండి. మీ అనుభవం సంతోషంగా, ఆనందంగా, మనోహరంగా ఉండి అలా గంటల తరబడి కూర్చోవాలనుకున్నప్పుడు, అప్పుడే నేను చెప్పినట్లు మీరు గంగను మర్చిపోతారు, నీళ్ళను మర్చిపోతారు, మీ మనసును మర్చిపోతారు, నేను చెప్పిన మాటలు మర్చిపోతారు, ఏమీ మిగలదు. అది సరైన అనుభవం.

మీరు గంగ ఒడ్డున కూర్చుని, "గురువుగారు చెప్పింది అది" అనుకొని, దానిని నేను చెప్పిన దానితో పోల్చి చూడటానికి ప్రయత్నిస్తూ ఉంటే మీరు అసలు విషయం మర్చిపోయినట్లే. అది సహజంగా, అప్పటికప్పుడు సంభవమయ్యే అనుభవం కావాలి. అది ఓ ప్రయత్నంగానో లేక సాధనగానో కాకూడదు. కొంతమందికి అటువంటి అనుభవం వచ్చింది, "ఆ అనుభవం ఎలా ఉంటుంది?" అని వాళ్ళు అడిగారు. అందుకనే నేను దానికి కాస్త ఎక్కువగా వివరణ నిచ్చాను. అంతే. ఆ కథ అక్కడితో ముగిసిపోయింది. (గురువుగారు నవ్వుతూ...) అంతేగానీ నేను చెప్పింది గంగాప్రవాహ ఉపదేశమో, గంగా సూత్రమో కాదు! (నవ్వులు...) అది అటువంటిది కాదు.

**భక్తుడు :** గురువుగారూ! గంగా ప్రవాహాన్ని చూస్తున్నప్పుడు ఒకవేళ మాకు ప్రతిదీ ప్రవాహ స్వరూపమనే అనుభవం కలిగితే ఆ అనుభవం అలాగే కొనసాగుతుందా లేక ఆ అనుభవం క్షణమాత్రంగానే ఉంటుందా?

**గురువుగారు :** అది ఆ క్షణంలో మాత్రమే ఉంటుంది. అది కేవలం ఆ క్షణంలోనే ఉన్నప్పటికి, ఆ అనుభవం మరిన్ని అనుభవాలకు దారితీయవచ్చు. ఆ ప్రవాహతత్వాన్ని మీరు రకరకాల ప్రదేశాలలో, రకరకాల అంశాలలో, మీ ఊహకు కూడా అందని చోట అనుభూతి చెందడం ప్రారంభిస్తారు. ఈ విశ్వంలో ప్రతిదీ చరిస్తూనే ఉంది. కేవలం గంగ మాత్రమే కాదు, మీరు ఆ స్థితిని రుచిచూడటం ప్రారంభిస్తారు. అదే అనుభవం నిరంతరం కొనసాగుతుందని, దానిని మీరు తరువాత నెమరువేసుకోవాలని కాదు. ప్రతి అనుభవాన్ని ఆ క్షణంలో క్రొత్తగా తీసుకోండి, దానిని అలాగే సాగిపోనివ్వండి.

**– శరశ్చంద్రికలు**

కరుణాపూర్ణ రసాజలధే ॥ ఆశ్రితజన అభయావరదే ॥
భక్త సుపూజిత శ్రీచరణే ॥ సమ్యక్ దర్శక సముద్ధరణే ॥
సాధకహృదయ సదా సంస్థితనే ॥ జిజ్ఞాసాపథ ప్రబోధకనే ॥
ఛాందసభావ వినాశకనే ॥ జ్ఞానశృంగ తవ గురుచరణే ॥





## మహిని వెలసిన మహోన్నత సద్గురువు...
## మన గురువు మనకొసంగిన మహిత తెరువు...

"అవధులు లేని భగవద్తత్త్వం పాంచ భౌతికదేహ పరిమితులలో ఎంత వరకూ ప్రకటం కాగలదో దానికి పరమావధే శ్రీసాయిబాబా", "సాయివంటి దైవంబు లేడోయి లేడోయి" అన్నారు గురుదేవులు.

ఒకసారి ఒక సత్సంగంలో ఒక గురుబంధువు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఇంకో గురుబంధువుని నిజంగా బాబా వంటి దైవం లేరా... అని అడిగారు. అప్పుడు ఆయన, అలా కాదు... అది గురువు గారికి బాబా పట్ల ఉన్న ప్రేమకు వ్యక్తీకరణ... మనం మన తల్లి... మన తండ్రి గొప్ప అనుకుంటామే అలా అని చెప్పారు.

ఎందుకో ఆ వివరణ నాకు సమన్వయపడలేదు... ఆ Statementsలో గురువుగారికి బాబాపట్ల ఉన్న అవ్యాజప్రేమ వ్యక్తమవుతోంది నిజమే... అయితే, అక్కడ ప్రేమ ఒక్కటే ప్రాతిపదిక కాదు... గురువుగారి కలం 'సత్యకామ' నుండి జాలు వారే ప్రతీ అక్షరం ఆయన దర్శించిన సత్యాన్నే ప్రతిబింబిస్తుంది. కాబట్టి ఇందులో నాకు అందనిదేదో ఉందన్న జిజ్ఞాస మొదలైంది.

మరి ఈ విషయంలో మనకు స్పష్టత వచ్చే దిశగా గురువుగారి సత్సంగాలలో ఏమైనా లింక్ దొరుకుతుందా అని ఆలోచిస్తే... Rose Petalsలో The Unique Mahima of Shirdi Sai Baba అన్న Editionలో గురువుగారు ఉదహరించిన రెండు బాబా లీలలు గుర్తుకు వచ్చాయి. ఆ లీలలు – ఒకటి కాటన్ మిల్ మేనేజర్ అనుభవం, రెండవది సందేహమడిగిన భక్తుణ్ణి, బాబా పోతీ దగ్గరకు వెళ్ళమన్న లీల.

ఆ రెండు లీలలు గురువుగారు ప్రత్యేకంగా బాబా విశిష్టతకు నిదర్శనంగా ఎందుకు చెప్పారా అని ఆలోచిస్తూ... ఆ లీలలను తిరిగి తిరిగి మననం చేస్తే, నేను వెతుకుతోన్న లింక్ దొరకకపోగా... ఇంకో సందేహం బయలుదేరింది. అదేమిటంటే, ఈ లీలలలో **బాబా చెప్పింది జరిగిందా?... లేక జరగబోయేదే బాబా చెప్పారా?** అని.

ఎటూ జరగబోయేదే బాబా చెప్పారా? అంటే Pre-determined eventని బాబా ముందే చెప్పారు అనుకుంటే... ఈ రెండు లీలల్లో కూడా బాబా ఆ ప్రత్యేకమైన సూచన ఇవ్వకపోతే ఆ సంఘటన జరిగే అవకాశమే లేదు... ఇక్కడ ప్రత్యేకమైన సూచన అని ఎందుకు అనాలి? ఎందుకంటే, గురువుగారు చెప్పినట్లు మొదటి లీలలో బాబా ఆ భక్తునికి బొంబాయి వెళ్ళు అని చెప్పి, ఆ వ్యక్తి ఆ మిల్లు యజమానిని బొంబాయిలో కలిసి ఉంటే అది వేరే విషయం. కానీ, బాబా పూనా మీదుగా వెళ్ళు

అని నిర్దిష్టంగా చెప్పారు... అతను పూనా మీదుగా వెళ్లకపోయినా... ఆ వ్యక్తిని స్టేషన్లో కలవకపోయినా ఆ లీల అలా జరిగే అవకాశమే లేదు. కాబట్టి ఎలాగూ జరిగేదో బాబా చెప్పారు అని అనుకోవడానికి లేదు.

సరి, బాబా చెప్పింది జరిగిందా? అన్న అవకాశం గురించి ఆలోచిద్దాము. రెండవలీలలో పోతీ జరిగే చోటికి వెళ్ళమని బాబా ఆ భక్తునితో అన్న తరువాత అందుకు అనుగుణంగా పరిస్థితులు అన్నీ మారిపోయి ఆ లీల జరగటంలాంటివి జరగలేదు... ఒకవేళ బాబా ఆ భక్తుణ్ణి వేరొక భక్తుని వద్దకు పంపి అతని ద్వారా వాచా సందేహ నివృత్తి అయ్యేలా చేసి ఉంటే అది వేరే విషయం... కానీ ఈ లీలలో సందేహం తీర్చింది పారాయణ... అది రోజూ జరిగే పారాయణే... పైగా, గురువుగారు చెప్పిన విధంగా ఆ భక్తుడు నేరుగా అక్కడికి వెళ్ళవచ్చు... టీ తాగి వెళ్ళవచ్చు... ఎలాగైనా వెళ్లనీ... ఎప్పుడైనా వెళ్లనీ... అతడు వెళ్ళి కూర్చోగానే... అతని ప్రశ్నకు సమాధానం ఆ పారాయణ గ్రంథం నుండి వచ్చేది. కాబట్టి, బాబా చెప్పారు కనుక ఒక Situation Create అయ్యి అలా జరిగింది అనుకోవడానికి లేదు.

కొన్ని వందల సంవత్సరాల క్రితం లిఖితమై ఉన్న గ్రంథం... కొన్నిరోజుల ముందుగా మొదలైన పారాయణ... అందులో ఆ రోజు ఆ భక్తుడు అక్కడకు వచ్చే సమయానికి చదవబడుతున్న ఆ భాగం, ఎప్పుడు ఏ సందర్భంలో ఆ భక్తుని మనస్సులో తలెత్తిందో, తెలియని సందేహానికి... సరిగ్గా సమాధానం.

కొంచెం సూక్ష్మంగా ఆలోచిస్తే ఈ లీలలలో, ముందే జరిగిన, ఆ సమయానికి జరుగుతోన్న, ఆ తరువాత జరగబోతున్న సంఘటనల మధ్య అద్భుతమైన కూర్పు కనిపిస్తోంది. బాబా అనుగ్రహంతో... ఆయన ప్రమేయంతో జరిగిన సంఘటన కూడా అత్యంత సహజంగా, యాదృచ్ఛికంగా జరిగిందా అనిపించేలా merge అయి ఉంది. ఆ విషయం మరలా ఆయన ముద్ర (Stamp) వేసి చూపితే గాని మనకు అర్థం కావటం లేదు.

అసలు ఏది **యాదృచ్ఛికమో... ఏది సాయైచ్ఛికమో...** మనకు అర్థం కానంత సహజరీతిన వ్యక్తమవుతున్న ఆయన మహిమకు కారణమైన ఆయన స్థితి ఎటువంటిదై ఉండాలి... అక్కడితో నా ఆలోచన ఆగిపోయింది... మనసు మూగబోయింది. ఆ ముగ్ధతలో అప్రయత్నంగా "అవధులు లేని భగవద్తత్త్వం పాంచ భౌతిక దేహ పరిమితులలో ఎంతవరకూ ప్రకటం కాగలదో, దానికి పరమావధే శ్రీసాయిబాబా" అన్న గురువు గారి మాటలు మనసుకొచ్చాయి.





చాలా రోజుల క్రితం ఎవరో చెప్పగా గుర్తు... ఆధ్యాత్మికత అనేది ఒక Endless Journey అనుకుంటే, అందులో మన చూపుకుకాదు... మన ఊహకు కూడా అందనంత దూరం వెళ్ళిపోయి ఉన్నారు బాబా... అని గురువుగారు చెప్పారు అని. ఆ విషయం గుర్తుకు రాగానే ఇంకో ఆలోచన మెరిసి మనసుకు చాలా సంతోషం కలిగింది. మన ఆలోచనకు కూడా అందనంత మహోన్నత స్థితిలో ఉన్న బాబాను చేరి కూడా... మన కోసం దిగివచ్చి... మన చేయి పట్టుకొని... సాయితత్త్వాన్ని అర్థమయ్యేలా వివరిస్తూ... మనం అడిగిన వరాలన్నీ ఇస్తూ... జీవిత పరమార్థం వైపు నడిపిస్తోన్న గురుదేవులు **సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ** ప్రేమకు, కరుణకు, అనుగ్రహానికి పాత్రులమైన మన మనందరమూ ఎంత భాగ్యవంతులమో కదా...

**అవధులు లేని ఆ దివ్యత్వం... దేహావధిని దాటి దశాబ్దమయ్యింది.**
**ఆ మహనీయుని మహిమతో పునీతమవ్వాలని శతాబ్దికాలం ఎదురుచూస్తోంది.**

**– *శేఖర్, చెన్నై***

## ‘కవి’ పరిణయం

**కథ**

“నాన్న కమ్యూనిష్టు, అమ్మ బుద్ధిష్టు, నేను ఏథిష్టు” చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్‌తో ఎన్నోసార్లు గర్వంగా చెప్పిన మాట గుర్తువస్తోంది. అరగంటలో ఇది మూడోసారి కాఫీ కౌంటర్ దగ్గరకు వెళ్ళడం. ఏంకావాలి అన్నట్లు చూశాడు కౌంటరులోని వ్యక్తి, మళ్ళీ కాఫీ అని చెప్పి కార్డు ఇచ్చాను. అతను నావంక విచిత్రంగా చూశాడు. అయినా ఇప్పుడు అతని చూపును పట్టించుకునే పరిస్థితిలో నేను లేను. కాఫీ కప్పు తీసుకుని టేబుల్ దగ్గరకు వెళ్ళాను, ఆలోచనలు మళ్ళీ ముసురుకున్నాయి. కార్యాకారణ సంబంధం లేకుండా సైన్స్ ముందు, కామన్‌సెన్స్ ముందు నిలబడని ఏ అంశమైనా ఎందుకు నమ్మాలి. అసలు దేవుడు, దెయ్యం అనే వాళ్ళకు ఆమడదూరంలో ఉండే తాను అనుపమ్‌తో పెళ్ళికి ఎందుకు ఒప్పుకుంది. పెళ్ళి ఓ వారంలో పెట్టుకుని ఎందుకు ఇంతగా ఆలోచిస్తోంది. ఎందుకు, ఎందుకు ...?

“హలో కవితగారూ, ఏంటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు, ఇంటికి రేకులు వేసే పనేదైనా పెట్టుకున్నారా?” కుర్చీ లాక్కుంటూ అడిగింది కవిత ఫ్రెండ్ సౌజన్య.

“దాదాపు గంటసేపటినుండి వెయిట్ చేస్తున్నాను నీకోసం, ఇంత లేటుగానా రావడం, దానికి తోడు దూరదర్శన్ కాలం నాటి జోకులు” విసుగ్గా అంది కవిత.

“సారీ తల్లీ, ఏంటి ఇంత ఫ్రస్ట్రేషన్, ఎంగేజ్‌మెంట్ అయిన తరువాత ఎంత ఉత్సాహంగా ఉండాలి, నువ్వు ఏంటి ఇంత చిరాగ్గా...” అంటూ కుర్చీ దగ్గరకు లాక్కుంది సౌజన్య.

“ఇప్పుడు చెప్పు ఏంటి అసలు సంగతి?” అనునయంగా అడిగింది సౌజన్య.

“అనుపమ్ గురించి ఆలోచిస్తున్నాను”

“అంతగా ఆలోచించడానికి ఏముంది, మీ ఇద్దరి ఒపీనియన్స్ చాలా విషయాల్లో సరిపోయాయి అన్నావు కదా” అంది సౌజన్య.

“అన్నీ విషయాలు ఓకే కానీ ఒక్క విషయం తప్ప”

“అతను వారానికి ఒకసారి సాయిబాబా సత్సంగాలకు వెళతాడన్నావు కదా ఆ విషయం గురించా?” కవిత తనతో అంతకుముందు ఎప్పుడో చెప్పిన విషయం గుర్తొచ్చి అడిగింది సౌజన్య.

“అవును, నాకేమో భక్తి, దేవుడు అంటే అస్సలు పడదు, నేను ఎంత ప్రయత్నించినా నా కామన్‌సెన్స్, ఇంటలిజన్స్ ఆ విషయాలను ఒప్పుకోదు. నేను వాటిని భరించలేను, నీకు తెలుసు కదా... ఈ రోజు నేను షాపింగ్ గురించి కాల్ చేస్తే తాను శిరిడీలో ఉన్నానని చెప్పాడు, రావడానికి రెండురోజులు పడుతుందట, అయినా అన్ని రోజులు శిరిడీలో ఏం చేస్తాడో నాకర్థం కావడం లేదు” మనస్సులోని మధనాన్ని బయటపెట్టాను.

“వారానికి ఒకసారి సత్సంగానికి, సంవత్సరానికి రెండుసార్లు శిరిడీకి వెళ్ళిరావడమే అన్నావు కదా?” నెలరోజుల క్రితం నేను తనతో అన్నమాటలను గుర్తుచేసింది సౌజన్య. “నేనూ అలానే అనుకున్నాను, కానీ అనుపమ్ విషయంలో అంతకుమించింది ఏదో ఉంది, వాళ్ళ ఫ్యామిలీలో అతనిని రాడికల్ అంటారట” ఏదో మిస్టరీ గురించి ఆలోచిస్తున్నట్లు కుర్చీ వెనుకకు ఆనుకుని కళ్ళు మూసుకుంది కవిత.

“నువ్వు మరీ ఎక్కువ ఆలోచిస్తున్నావు, నూటికి నూరు శాతం మనలాగే ఆలోచించేవాళ్ళు దొరకరు కదా, అన్నట్లు అనుపమ్ చాలా ఓపెన్ మైండ్‌తో ఉంటాడు అన్నావు కదా, నువ్వు అతనిని మార్చుకోవచ్చు కదా, నిన్ను తన నమ్మకాలతో ఇబ్బంది పెట్టనంతవరకు నీకు మరే ప్రాబ్లం ఉండదు, నువ్వు మరీ హైరానా పడిపోకు, అయినా నీతో వాదించి గెలవడం ఎవరికైనా సాధ్యమేనా” అంటూ కొంటెగా నవ్వింది సౌజన్య.

చివరి వాక్యంలో కాస్త వ్యంగ్యం ధ్వనించినా సౌజన్య మాటలు నిజమే అనిపించాయి, ఆ విషయంలో నామీద నాకు ఆ నమ్మకం ఉంది. టైం నాలుగున్నరవుతోంది, కాబ్‌లు





బయలుదేరే టైం అయింది అనుకుంటూ ఇద్దరూ డెస్క్ దగ్గరకు బయలుదేరి వెళ్ళారు.

రోజులు క్షణాల్లా గడిచిపోయాయి. పెళ్ళయి దాదాపు రెండు నెలలు అవుతోంది. నాలో ఎన్నో ప్రశ్నలు, కానీ ప్రతి ప్రశ్నకు అనుపమ్ దగ్గర సమాధానం రెడీగా ఉంటుంది, నేను ఇదే ప్రశ్న అడుగుతానని సమాధానాలు ఆలోచించి పెట్టుకున్నాడా అనిపిస్తుంది. అతను చెప్పే సమాధానాలను ఎందుకో అంత తేలిగ్గా కొట్టి పారెయ్యలేం. నిన్న జరిగిన డిస్కషన్ మళ్ళీ గుర్తుకువస్తోంది. నేను కాజువల్‌గా “సాయిబాబా దేవుడా?” అని అడిగాను. అనుపమ్ అంతే కాజువల్‌గా “దేవుడంటే నీ దృష్టిలో ఎవరు?” అన్నాడు. ఒక్క నిమిషం నాకు కాసేపు మైండ్ బ్లాంక్ అయింది. చిన్నపాటి షాక్. మీ దేవుడు, ఈ దేవుడు, ఆ దేవుడు అని ఎంతోమందితో వాదించాను కానీ, “దేవుడు” గురించి ఆబ్జెక్టివ్‌గా ఎప్పుడూ ఆలోచించలేదు. అసలు ఆలోచన ముందుకు సాగలేదు, ఏదో సమాధానం చెబుదామని ప్రయత్నిస్తూ ఉంటే తానే నింపాదిగా– వీలుంటే శ్రీసాయిబాబా జీవిత చరిత్ర చదవమని చెప్పి టాపిక్ ఫుడ్ మీదకు మార్చేసాడు. అసలు తనలో నాకు నచ్చే గుణమే అది, నాతో జరిగిన వాదనలో తను నెగ్గినా, అసలు అదేమంత విషయం కాదని టాపిక్ మార్చేస్తాడు. నేనేదో ఓడిపోయాననే భావనే కలగనీయడు.

నాలుగైదు రోజులలో బాబా చరిత్రకు సంబంధించి ఇంట్లో ఉన్న పుస్తకాలన్నింటినీ చదివేశాను. నాలో ఎటువంటి భావము కలుగలేదు, చాలా పుస్తకాలలోని ఉపోద్ఘాతాలు పౌరాణికంగా ఉన్నాయి, నన్ను ఆ పుస్తకాలు పెద్దగా కదిలించలేదనే బహుశా కదిలించలేవనే భావనకు వచ్చేసాను. కిచెన్ లోకి వెళ్ళి కాఫీ కలుపుకుని వచ్చి బాల్కనీలో అలా కూర్చున్నాను, కాఫీ చేతులో ఉంటే నాకళ్ళు పుస్తకం కోసం వెతుకుతుంటాయి. బుక్‌షెల్ఫ్‌లో పుస్తకాల చివర ఏదో మ్యాగజైన్ కనిపించింది, దానిని చేతుల్లోకి తీసుకున్నాను, సాయిబాబా ఒరిజినల్ ఫోటో కవర్ పేజీ మీద ఉంది, ఓ.. బాబా నిజంగా ఇలా ఉంటారా అని బాబా ఫోటో కేసి కుతూహలంగా చూసాను. ఉదయం చదివిన చరిత్రలో ఎక్కడో బాబా ‘నాకు నా ఫోటోకు తేడా లేదు’ అని చెప్పిన మాట గుర్తుకువచ్చింది. ఆ మాట మనస్సుకు రావడంతోనే కళ్ళు బాబా మీద నిలిచిపోయాయి.

కాలింగ్‌బెల్ మోత వినిపించింది, ఒక్కసారిగా ఈ లోకంలోనికి వచ్చాను. ఏంటి నాకు ఏమైంది? చుట్టూ చిమ్మ చీకటి, టైం దాదాపు ఏడవుతోంది. దాదాపు గంటసేపు నేను బాబాకేసి చూస్తూ అలా కూర్చుండిపోయానా అని నాకే ఆశ్చర్యం వేసింది. అనుపమ్ ఆఫీసు నుండి వచ్చాడు. ఆ రోజు ‘గురువారం’ తాను సత్సంగానికి వెళ్తాడు, ప్రతిసారీ మాదిరిగానే వస్తావా అని అడిగాడు. ఈ రెండు నెలలలో ఏనాడు తాను రమ్మని బలవంతం చెయ్యలేదు, వస్తావా అని మాత్రమే అడుగుతాడు.

రానని చెప్తే అదేమంత పెద్దవిషయం కానట్టు తాను వెళ్ళిపోతాడు. ఈ రోజు ఎందుకో నన్ను రమ్మని పిలిస్తే బావుండును అనిపించింది. తను రడీ అయ్యి నన్ను వస్తావా అని ప్రతివారంలానే అడిగాడు, నాకు కొంచెం నిరాశగా అనిపించింది. నువ్వు వెళ్ళి వచ్చేయ్ అని చెప్పాను. తను సరే అంటూ వెళ్ళిపోయాడు. ఎందుకో కాస్త బాధగా అనిపించింది.

సరిగ్గా రెండు నిమిషాల తరువాత కాలింగ్ బెల్ మ్రోగింది, తలుపుతీయగానే ఎదురుగా చేతికి రుమాలు కట్టుకట్టుకుని అనుపమ్ నిలబడి ఉన్నాడు, నేను ఏమయిందని ఆదుర్దాగా అడిగాను, కారిడార్‌లో ఎవరిదో ప్యాకేజ్‌ను ప్రక్కకు జరుపుతుంటే దానికున్న పిన్ ఒకటి అరచేతికి గుచ్చుకుందని చెప్పాడు. అప్పటికప్పుడు కాస్త ఫస్ట్‌ఎయిడ్ చేసి చేతికి కట్టుకట్టాను. కాసేపటికి తను కవితా, నన్ను సత్సంగం దాకా డ్రాప్ చెయ్యగలవా అని అడిగాడు, నాకు చాలా సంతోషంగా అనిపించింది. సరే అని చెప్పి తనను సత్సంగానికి తీసుకెళ్ళి పూర్తయ్యేదాకా ఉండి తరువాత ఇంటికి వచ్చాం. నిత్యప్రార్థన నుండి ఆరతి వరకు నాలో ఎన్నో ప్రశ్నలు మొదలయ్యాయి. ఇంతలో నువ్వు శరశ్చంద్రికలు చదివావా అన్నాడు అనుపమ్, లేదని చెప్పాను, నేను మన పెళ్ళికి ముందు నీకు ఓ పుస్తకాల బండిల్ పంపాను గుర్తుందా, అందులో ఉన్నాయి ఆ పుస్తకాలు నీకు వీలు దొరికితే చదువు అన్నాడు. సరే అన్నాను.

ఆరోజు ముందుగా ఇంటికి వచ్చాడు అనుపమ్. టీపాయ్ మీద శరశ్చంద్రికలు చూసి, ఓ అన్నీ చదివేసావా అన్నాడు అనుపమ్. బాబా చరిత్ర చదివినప్పటి నుండి నాలో కలుగుతున్న అనుభూతులు, అర్థం చేసుకోలేక సంఘర్షణ అనుభవిస్తున్న నాలోని నాస్తికురాలు–అవకాశం కోసం ఎదురుచూస్తోంది, ఇప్పుడు సరైన సందర్భం దొరికింది. "ఏంటి మనం బాబా బాబా అనుకుంటే సరిపోతుందా, అంతా బాబానే ఎలా చూసుకుంటారు, మనిషిగా మన ఉనికికి, మానవ ప్రయత్నానికి మరి అర్థం ఏమిటి" నేను సూటిగా అడిగాను. తాను విప్పుతున్న షూస్ ప్రక్కనబెట్టి నా వైపు తలెత్తి చూశాడు, "బాబా బాబా అనుకోవడం అంత సులువైతే అనుకుని చూడు తెలుస్తుంది కదా" అన్నాడు నింపాదిగా.

"నేను లాజికల్‌గా అడుగుతున్నాను" అన్నాను నేను కాస్త కంప్లెయినింగ్ గొంతుతో.


"నేను ప్రాక్టికల్‌గా చెబుతున్నాను" అన్నాడు తను.


"అంటే ముందు భక్తి ఉండాలంటావా ?"

"కాదు ప్రేమ ఉండాలి"

"భక్తికి ప్రేమకు తేడా ఏమిటి?"

"తేడా సంగతి నాకు తెలియదు, కానీ భక్తి అనే మాటకు మనకు తెలిసిన అర్థం చాలా ఆబ్‌స్ట్రాక్ట్‌గా ఉంటుంది. అందుకే గురువుగారు ప్రేమ అనే పదాన్నే వాడేవారు"





"సాయిపథంలో ఉండే వాళ్ళంతా గురువుగారిని, బాబాను అంతగా ప్రేమిస్తారా" అని అడిగాను నేను.

"బాబాను, గురువుగారిని నిజంగా ప్రేమిస్తూ వారికి ఇష్టం వచ్చినట్లు ఉండటమే సాయిపథంలో ఉండటం అంటే" అన్నాడు అనుపమ్.

"సాయిపథానికి మిగతా ఆధ్యాత్మిక మార్గాలకు తేడా ఏమిటి, వాళ్ళందరూ ముక్తీ మోక్షం అంటారు, మీరు బాబా అంటారు. పేర్లు ఏవైనా మీ అందరి లక్ష్యమూ ఏదో మానవాతీత స్థితిని పొందడమే కదా?"

"ఖచ్చితంగా కాదు, ఎక్కడికి వెళ్ళాలో తెలియక ఏదో ఒక రైలు ఎక్కడంలాంటిది ముక్తిని మోక్షాన్ని కోరుకోవడం అంటే. ఎక్కడికి వెళ్ళాలో క్లారిటీ ఉండి, అక్కడికి వెళ్ళే రైలు ఎక్కి మనం దిగాల్సిన చోటు వద్ద దించడానికి సిద్ధంగా ఉంటూ, మన బాధ్యతలు తీసుకునే వారి సంరక్షణలో వంటిది సాయిపథం", షార్ప్‌గా వచ్చింది సమాధానం.

"శ్రీబాబూజీ అంటే ఎందుకంత భక్తి–అదే ప్రేమ ఎందుకు మీ అందరికీ ?"

"మాకు ఆయనంటే ప్రేమ కాదు, ఆయనకే మేమంటే అంత ప్రేమ. ఇనుము అయస్కాంతానికి ఆకర్షింపబడటం అంటే అది ఇనుము గొప్పతనమా లేక అయస్కాంతం గొప్పతనమా?"

"అంటే మీ వైపునుండి ఏమీ జరగడం లేదంటావా?"

"జరుగుతుంది, కేవలం ఆ ప్రేమకు ప్రతిస్పందించడం" చాలా మార్దవంగా వచ్చింది సమాధానం. ఆపై నాకు ఈ సంభాషణ పొడిగించాలనిపించలేదు. ఏదో తెలియని ప్రశాంతతతో మా పరిసరాలు నిండిపోయాయి.

రోజులు గడిచిపోతున్నాయి. అనుపమ్ గత రెండు నెలలుగా ప్రాజెక్టు డెలివరీ కోసం చాలా కష్టపడి పనిచేస్తున్నాడు, నిన్న ప్రాజెక్టు లైవ్‌లోకి వెళ్ళాల్సిన రోజున ఏవో ప్రాబ్లమ్ వచ్చి ప్రాజెక్టును రోల్ బ్యాక్ చేశారు. ప్రాజెక్టు టీమ్ అంతా బెంచ్ మీద ఉన్నట్లే అన్నాడు తన మేనేజర్. అంత కష్టపడ్డ ప్రాజెక్టు ఫెయిల్ అయ్యేటప్పటికి అనుపమ్ చాలా డిజప్పాయింట్ అవుతాడని అనుకున్నాను. కానీ తాను ఎప్పటిలాగే తన పనులు చేసుకుంటూ వెళ్ళిపోయాడు. ఆరోజు రాత్రి పడుకునే ముందు అడిగాను.

"అనూ, బాగా డిజప్పాయింట్ అయ్యావా" అడిగాను, నిజానికి తను అలా కనిపించడం లేదు, చాలా ప్రశాంతంగా ఉన్నాడు.

"ప్రాజెక్టులో మిగతా వాళ్ళని గురించి ఆలోచిస్తున్నాను, వాళ్ళకు మరో ప్రాజెక్టు వస్తే బావుణ్ణు"

అన్నాడు అనుపమ్.

"మరి నీ సంగతి, నువ్వూ బెంచ్ మీదకు వస్తావు కదా"

"అది బాబా చూసుకుంటారు" అన్నాడు అదేదో తనకు సంబంధించిన విషయం కానట్టు.

"నువ్వు బాబా, గురువుగారు అంటావు కదా. మరి ఇలా అయిందేమిటి, నీకు బాధగా లేదా?" మెల్లగా అడిగాను.

"నేను శ్రద్ధగా పని చేయలేకపోతే నేను బాధపడాలిగానీ, ఫలితం గురించి మనకెందుకు? బాబా చెప్పినట్లు శ్రద్ధగా చెయ్యడం నా చేతుల్లో ఉంది, నేను నా శక్తిసామర్థ్యాల మేరకు ప్రయత్నం చేసాను, తరువాత బాబా ఇష్టం"

"అడిగినవన్నీ ఇస్తానన్నారు కదా బాబా"

"ప్రాజెక్టు సక్సెస్ కావాలని నేను అడగలేదు, నా వైపునుండి ఎటువంటి ప్రయత్న లోపం జరగకుండా చూడమని బాబాను అడిగాను, ఫలితం ఆయనిష్టం. ఆ విషయంలో నాకు క్లారిటీ ఉంది" చాలా క్లియర్‌గా చెప్పాడు అనుపమ్.


నా దగ్గర ఇంకే ప్రశ్నలు మిగల్లేదు. గొప్పగా గెలిచే వాళ్ళను చూసాను, కానీ పరిపూర్ణంగా ప్రయత్నించినపుడు ఓడిపోవడంలో కూడా గొప్ప సంతృప్తి ఉంటుందని ఎక్కడో చదివిన మాటలు గుర్తొచ్చాయి. మన ప్రయత్నం సంపూర్ణంగా జరిగినపుడు మనం పొందే తృప్తి గెలుపోటములకు అతీతంగా ఉంటుందన్న విషయం అనుపమ్‌ను చూస్తే అర్థమయింది. బాబా-గురువుగారి పట్ల నాలో తెలియని ఆకర్షణ ఒక రూపం తీసుకోవడం మొదలైంది, అలాగని ప్రశ్నలు లేవని కాదు, అవి ఇప్పట్లో ఆగేటట్టు లేవు కూడా. అలా సాగిపోతుండగా ఒకరోజు ఎందుకో మాటల మధ్య అనుపమ్‌ను ఓ ప్రశ్న అడిగాను.

"అనుపమ్, ఒకవేళ ఎవరైనా పూర్తిగా బాబాకు శరణాగతి పొందారనుకో, అతని జీవితం ఎలా ఉంటుంది? అతని రోజూవారీ జీవితం ఎలా ఉంటుంది? మనకు సందేహం వస్తే ఎవరిని స్టాండర్ట్‌గా తీసుకోవాలి"

"శ్రీబాబూజీ" అన్నాడు. నేను అడిగే యక్ష ప్రశ్నలకు తాను ఎక్కువగా చెప్పే సమాధానమది.

"మళ్ళీ అడుగుతున్నాను, మీ అందరికీ గురువుగారంటే ఎందుకంత ప్రేమ, హీరో వర్షిప్, మీలో చాలామంది ఆయనతో వ్యక్తిగతంగా మాట్లాడినట్లు లేదు, మీరు నిజంగా ఆయనని ప్రేమిస్తున్నారా లేక మీకు ఆయన పట్ల ఉన్న ఇమేజ్‌ను ప్రేమిస్తున్నారా? అంటే సినిమా హీరోలని వాళ్ళ అభిమానులు ఆరాధించినట్లు?"





అని అడిగాను. అనుపమ్ అన్నింటికీ గురువుగారే సమాధానం అంటాడేమిటి అని నాలో ఎక్కడో కాస్త అసహనం.

"నువ్వు చెప్పింది కూడా నిజం కావచ్చు, కానీ ఆయన ప్రతిసారీ మాకున్న ఫలానా ఇమేజ్ కన్నా ఎన్నోరెట్లు గొప్ప అని నిరూపిస్తారు, ఆయనంటే మాకున్న భావనలు పటాపంచలువుతాయి. అప్పటివరకు మాకున్న అవగాహన తప్పు అని తెలుస్తుంది. కానీ అందులో బాధ ఉండదు. చాలా ఆనందంగా ఉంటుంది. అసలు ఆ అనుభవమే చాలా గొప్పగా ఉంటుంది." అన్నాడు అనుపమ్. ఆ మాట చెబుతున్నపుడు అతని కళ్ళలో కనిపించిన మెరుపు నాకు తెలుస్తూనే ఉంది. తాను చెప్పడం కొనసాగించాడు.

"శిరిడీలో ఎన్నో రోజులుగా ఉంటున్నప్పటికీ, అందరూ సద్గురువుగా భావిస్తున్నప్పటికీ గురువుగారు బాబా దర్శనం కోసం క్యూలైన్ లోనే వెళ్ళేవారు, కొందరు పెద్ద పెద్ద పూలమాలలు తెచ్చి వేస్తుంటే వారి చర్యలు ఇతరుల స్థోమతను గుర్తుచేస్తుందని చెప్పి పూలమాలలు వేయించుకోవడం మానేసారు. కాస్త పాండిత్యం ఉన్నవాళ్ళే టీవీలలో, ఆన్‌లైన్‌లో ప్రముఖమైన గురువులుగా చలామణీ అవుతుంటే, అంత జ్ఞానసంపత్తి ఉన్నప్పటికీ అజ్ఞాతంగానే ఉన్నారు. ఇప్పుడిప్పుడు మేము కాస్త చిన్నచిన్న ప్రయత్నాలు చేస్తున్నాం తప్ప ఇప్పటికీ ఆయన గొప్పతనం సమాజంలో చాలామందికి చేరలేదు. నిజానికి చెప్పాలంటే మాలో కూడా చాలామందికి పూర్తిగా తెలియదు". "మీలో చాలామందికి గురువుగారి గురించి పూర్తిగా తెలియదు కదా, గురువుగారంటే ఇదీ, ఆయన ఆదర్శాలంటే ఇవీ అని చెప్పి మీలో మీకు ఎప్పుడూ వాదోపవాదలు జరగవా?"

"ఎన్నో జరుగుతాయి, అందుకే బహుశా ఆయన మమ్మల్ని సాయిభక్తులు అనలేదు సాయిసీకర్స్ అన్నారు. మాకు పూర్తిగా తెలుసు అనుకోవడానికి అవకాశమే లేదు. బాబాగురించి, గురువుగారి గురించి తెలుసుకోవడానికి మా అన్వేషణ కొనసాగుతూనే ఉంటుంది, కాబట్టి మాలో తెలియని ఓపెన్‌నెస్ ఉంటుంది, నిజానికి మమ్మల్ని ఓపెన్‌గా చేసేది గురువుగారే. నిజానికి అదీ నిజమైన అనుగ్రహమంటే"

"అనుగ్రహం అంటే కోరికలు తీర్చడం కదా?"

"అది కూడా, కోరిక తీరిన ప్రతిసారీ, మన కష్టం తీరిన ప్రతిసారీ మనం ఓపెన్‌గా తయారవుతాం, నిజానికి అదీ అసలైన అనుభవం" అన్నాడు అనుపమ్. నాకెందుకో ఈ సమాధానం చాలా ప్రశ్నలకు సమాధానం అనిపించింది, అంతకు ముందు బాబా చేసిన, అద్భుతాలుగా భావించిన ఎన్నో సంఘటనలు నాకు ఒక్కొక్కటిగా గుర్తుకు రావడం మొదలుపెట్టాయి. నాకు బాబాచరిత్ర మరోసారి


చదవాలనిపించింది. కానీ నాకు ఈ డిస్కషన్ ఆపాలని అనిపించలేదు, "ఉదాహరణకు నువ్వున్నావు, బాబా, గురువుగారు ఉన్నారు, మీ మధ్య సంబంధాన్ని ఎలా అర్థంచేసుకోవాలి".


"నాకు సైట్ ఉందనుకో, నా కళ్ళముందే ఉన్నప్పటికీ బాబా నాకు సరిగా కనిపించరు, గురువుగారు చూపును సరిచేసే కళ్ళద్దాల్లా ఉంటారు, గురువుగారు, వారి జీవిత విధానం అనే గ్లాసెస్ పెట్టుకొని చూస్తే బాబా చక్కగా కనిపిస్తారు, అద్దాలు లేవనుకో, మాకు బాబా అస్పష్టంగా కనిపిస్తారు అక్కడ మా ఊహలకు ఇమేజ్‌లకు అవకాశం ఉంటుంది., కానీ కళ్ళద్దాలు ఉంటే బాబా బాబాగా కనిపిస్తారు, ఇంకా గురువుగారి మాటల్లో చెప్పాలంటే బాబా కూడా ఓ అద్దమే, కానీ ఆ అద్దంలో మనకు మనం కనిపిస్తాం, మనలోని లోటుపాట్లు కనిపిస్తాయి, అవి సరిచేసుకుంటూ పోతే మనం కూడా ట్రాన్స్‌పరెంట్‌గా మారిపోతాం, ఇక అక్కడ మిగిలేది ఏమిటి అనేది బహుశా మాటలకు అందదు" అని తాను ఆగాడు. చాలా రోజుల నుండి నా మనస్సులో మెదులుతున్న ప్రశ్న బయటకు వచ్చింది.

"గురువుగారు, బాబానే మీ ప్రపంచం అనుకుంటున్నారు కదా, వ్యక్తిగతంగానూ, సాయిపథంగానూ మీ చరమ లక్ష్యం ఏమిటి?" "నిజానికి చెప్పాలంటే బాబాకు–గురువుగారికి నచ్చినట్లు ఉండటమే అంతిమ లక్ష్యం, మా పథం పట్ల మాకున్న ప్రేమను వ్యక్తం చేసుకునే క్రమంలో నలుగురికి వారిని పరిచయం చెయ్యడం, ఎవరైనా వారికి దగ్గర కావాలనుకుంటే అడ్డుపడకుండా ఉండటం తప్ప వేరే లక్ష్యాలంటూ లేవు" చాలా స్థిరంగా చెప్పాడు అనుపమ్. కాసేపు ఆగి తను చెప్పిన మాట నాకు చాలా రోజులపాటు గుర్తుండిపోయింది.

"నేను సాయిపథంలో ఉన్నాను, కానీ నేను సాయిపథం కాదు. ఒకవేళ ఎవరైనా నా ప్రవర్తనను బట్టి సాయిపథాన్ని, గురువుగారి అంచనా వేస్తానంటే నేను అంగీకరించను, కాయను బట్టి చెట్టును ఎక్కడైనా అంచనా వేయవచ్చు కానీ సాయిపథంలో మాత్రం కాదు, సాయిపథంలో ఎవ్వరైనా సరే శ్రీబాబూజీ ఆదర్శాలను కాస్త ప్రతిబింబించవచ్చు కాక, కానీ వారి గొప్పతనానికి, ప్రేమకు ఎవ్వరూ ప్రామాణికం కాదు. ప్రతి ఒక్కరూ సొంతంగా వారి గొప్పతనాన్ని అనుభవంలోనికి తెచ్చుకునే ప్రయత్నం చెయ్యాలి" డిస్కషన్ అక్కడితో ఆగిపోయింది. రోజులు సాగిపోతున్నాయి. ఇప్పటికీ నాన్న కమ్యూనిష్టు, అమ్మ బుద్ధిష్టు, నేను ఏథిస్టు మరియు సాయిసీకర్. అంతకుముందు ఎన్నో ప్రశ్నలు నాలో, ఇప్పుడు చాలా ప్రశ్నలకు నేనే సమాధానం. ఇంకా సాగించాల్సిన అన్వేషణ చాలా ఉంది.

*– సద్గురుప్రేమ 'భీము'డు, చెన్నై*





# గురుకృపాలహరి

వాక్కులన్నీ మరలిపోయి, వ్యవహారమంతా అణిగిపోయి, ప్రశ్నలన్నీ సమాధానపడి చిత్తశాంతి కలిగే క్షేత్రం సద్గురు సన్నిధానం. సద్గురు సన్నిధానం ఎవ్వరికైనా నిర్హేతుకంగా లభించవలసిందే. మానవతను పాతిబెట్టి మనిషినని మరచిపోతున్న జగతికి దారిచూపించి, మానవుడు మాధవుడవ్వగలడని విశ్వాసం కలిగించేందుకు అవతరించిన రూపం సద్గురువు. ఎవరినడిగి వసంతం వస్తుంది? గురువూ అంతే! మనం ఏదో చేస్తే మన జీవితంలోకి గురువు రావడం జరగలేదు. మన జీవితంలోకి వేంచేసి, వైభవంగా జీవితాన్ని మలచడానికి దారి చూపుతున్న గురువును మనం గుర్తిస్తేచాలు. గమనాన్ని, గమ్యాన్ని కూడా తానే చూసుకోగల సప్రేమ స్వరూపం గురువు. “ఆద్యంతాలు లేని ఈ పాదాలు పరమపవిత్రమైనవి” అన్నారు శ్రీసాయిబాబా. ఈ క్రమంలో శ్రీసాయి – గురువు పాదాల మొక్క వైశిష్ట్యాన్ని మానవహితం కోసం సుస్పష్టం చేశారు. అట్టి పరమపవిత్రమైన సద్గురు చరణాలు మన కోసం కదిలి వస్తే – అది తీర్థక్షేత్రం మన కోసం కదిలివచ్చినట్లే కదా! మరో అంశమేమంటే కదిలివస్తున్న ఆ చరణాల స్మరణలో ఆ పాదాలను మన హృదయంలోనూ నిలుపుకోవచ్చు కదా! కదిలొస్తున్న ఆ చరణాలను మది గుడిలో ప్రతిష్ట చేసుకునే అమృత సమయం “గురుకృపాలహరి”. మూర్తీభవించిన అనుగ్రహంతో మనమూ ఇప్పటి వరకు పాదయాత్రలో మానసికంగా పాల్గొంటున్నాం. సద్గురు చరణాలకు వినమ్రులమై వారి పాదధూళిలో పవిత్రమయి జీవితాలను పండించుకునే ప్రయత్నం చేద్దాం... పదండి...

టాటా స్టీలు కర్మాగారము పర్యటనానంతరము ఎంతో శ్రమతో కూడిన మార్గముల ద్వారా స్వామి వారు కియోంజర్ రాజ్యములోనికి అడుగుపెట్టారు. అక్కడి రాజకుటుంబ మర్యాదలను స్వీకరించి కియోంజర్‌లోనే శివరాత్రిని, వారి సద్గురు ఆరాధనను సంపూర్ణం గావించారు. ఆ శివరాత్రినాడు రాత్రి మొత్తం రాజకుటుంబం అక్కడే ఉండి పూజలలో పాల్గొనడం రాజుకివ్వవలసిన భక్తిప్రపత్తులను తెలియచెప్పాయి. కియోంజర్‌లోని ప్రాచీన ఆలయాలను కూడా స్వామి దర్శించారు. అక్కడి ధారణీదేవి ఆలయం ఎంతో ప్రముఖమైనది. ఆ విగ్రహమును కంచి నుండి గోవింద భంజదేవులు తీసుకుని వచ్చారట. మయూర్‌భంజ్ రాష్ట్రములో – వారణేశ్వరాలయములో మహాలింగమును దర్శించారు. నీలగిరి రాజ్యములో సుజన్‌ఘాట్ చేరారు స్వామి. అక్కడి చండీదేవి మామూలుగా కనబడే సింహవాహినిగా కాక వరాహమును వాహనముగా ధరించి భక్తులను అనుగ్రహించడం విశేషం. అక్కడి చిన్నస్కూల్‌ను తమ చరణస్పర్శతో పావనం చేసారు స్వామి. సుజన్‌ఘాట్‌లోనే ఉగాది కూడా సంబరంగా జరిగింది.

**– గురుకృప**

ఏ క్షణానికి ఈ శరీరం వ్యాధిగ్రస్థమవుతుందో అని భయపడుతూ నిత్యం పిడకల వేటలో జీవనం
అందునా తనువు శిథిలమైపోతున్నవేళ!
అస్పష్టమైన జీవన గమ్యాన్ని తెలియపరచి విస్పష్టంగా తనువునూ, మనస్సునూ సమాయత్తపరిచిన
మీ అనుగ్రహానికి ఆనందపడాలా?
శల్యమైపోయే ఈ శరీరాన్ని మీ సన్నిధితో పవిత్రము చేసే జీవనగమనంలో ఉపకరణాలుగా మలచిన
మీ శిల్పనైపుణ్యానికి కృతజ్ఞతతో కరిగిపోవాలా?
అన్నింటికన్నా చెయ్యిపట్టుకొని నడిపిస్తానన్న మీ వెంట నడవలేని వ్యాధిగ్రస్థమైన
ఈ శరీరాన్ని సరిచేయమని మీకు సాగిలపడాలా?

మనస్సు అయాచితమైన మీ అనుగ్రహ వర్షంలో తడిసి ముద్దైంది. అమృతపానం చేసి, కృతజ్ఞతతో నిండి నిత్యనూతన వసంతాలు తెచ్చింది.
అలా అవధులు లేని మీ ప్రత్యక్ష సాన్నిధ్యపు ఆనందాంబుధిలో మనస్సు మునిగితేలిన రోజులు దూరమయ్యాయి.
పది సంవత్సరాల కాలంలో మీ ఆరాధనల్లో మనస్సు ఆయత్తమైంది. మీ నిజసుఖ సమాధికి, ఆ సమాధి రూపానికి చేరువయ్యింది. కానీ ఎటుచూసినా ఆటంకాలే! ఆద్యంతం అమృతమస్తమైన మీ సన్నిధి ప్రాబల్యంతో పది సంవత్సరాల కాలంలో పట్టుమని పంచేంద్రియాలపై పట్టు కూడా సాధించలేదు. పదునెక్కిన క్రూరమైన కాలం కోరల్లో కరకర నమలబడుతూ తప్పించుకుంటూ తడబడుతూ పట్టుతప్పుతూ సాగిపోతుంది జీవనం. అనుగ్రహ శిఖరం మీరు నా ఎదురుగా ఉన్నా, మీ ప్రేమానుగ్రహానికి కృతజ్ఞత నిండిన నా మనస్సు తపిస్తూ ఉన్నా అనంతానంత లోపాలతో ఉన్న ఈ అవిటివాడికి నిత్యపోరాటమే శరణ్యమయింది చివరకు!

ఇంద్రియ నిగ్రహం సరి... మనస్సు మాటేమిటి అది దేనిపై గురి...
నా మనస్సుపై మీ అనుగ్రహపూరిత ప్రేమ సామ్రాజ్యాన్ని స్థాపించారని ఆనందపడాలా? ఆ ప్రేమ సామ్రాజ్యం సింహాసనాన్ని అధిష్టించి నా మనస్సు రేడై కొలువై ఉన్నారని కృతజ్ఞతతో నిండిన మనస్సుతో కరిగిపోవాలా?



అన్నింటికన్నా తైలం రాసుకున్న కాగితంలాంటి నా మనస్సుపై మీ పదముద్రలు, పాదజాడలు జారిపోతున్నాయి. వాటి ఆనవాళ్ళు చెరిగిపోతున్నాయని అనే కలవరాన్ని కడతేర్చేదెవరు? నా రాక్షస ప్రవృత్తి అయిన తైలాన్ని మీ ప్రేమాగ్నితో మండించి, దహించి దయచూపమని మీకు సాగిలపడటమే నాకు తరుణోపాయంగా తోస్తోంది.
కృతజ్ఞత నిండిన మనస్సుతో ఏ అరమరికలూ లేకుండా ఇలా వేడుకోవడమే ఈ ప్రార్థనా సారాంశంగా నా మనస్సుకు తెలుస్తోంది.
మీ ప్రేమపూరిత అపార కృపాంతరంగపు
అనుగ్రహ వర్షధారలు ప్రత్యుత్తరమై సర్వజీవులపై కురవాలని మీ మహా ఆరాధనోత్సవాలు పర్వదినమైన ఈ వేళ మీ నిత్య ఆరాధకులు విన్నవిస్తూ... అర్థిస్తూ, తపిస్తూ, ప్రార్థిస్తూ....

- శరత్ అన్వేషి -

తండ్రీ! ఇంతగా బాధ్యతపడి, ఇంతవాడివై, మా కొరకు ఇంతవాడివై, ఇన్ని విధాలుగా రక్షణ, శిక్షణలను అందిస్తూ నీ అడుగులోన మా అడుగు పడేట్లుగా చూస్తున్న నీకు, కంటికి రెప్పలా కాచుకుంటున్న నీకు, కృతజ్ఞతలు ఎలాగయ్యా చెప్పడం? కృతజ్ఞతలు చెప్పడం అసలు ఎలాగ సాధ్యం? కృతజ్ఞతలు చెప్పాలీ అంటే నిన్ను మా కన్నా వేరుగా చూడాలి. అది సత్యమూ కాదు, సాధ్యమూ కాదు. ఆ చెప్పగలిగినంతసేపూ చెప్పుకుంటున్నంతసేపూ, జీవిత నిర్వహణలో ఈ సందేశాన్ని పాటించగలిగినంతసేపూ ఎంత బాగుంటుందో! ఎంత బాగుంటున్నదో!



మరప్పుడేం చేయాలి? నాకు తెలిసిందల్లా ఒక్కటే. హృదయాన్ని నీ సింహాసనంగా చేసి, ఈ దేహాన్ని నీ దేవాలయంగా రూపొందించుకొని, నీవు ఇస్తున్న ఆదేశాలను ఈ జీవిత రూపంలో నిర్వహిస్తూ ఉండాలి. ఆ నిర్వహిస్తున్న వేళలో నీతో ఏకత్వాన్ని నిరంతరం అనుభవించగలగాలి. ఆ అనుభవించగలిగేటందుకు అన్నివేళలా, అన్ని విధాలా సంసిద్ధంగా ఉండటమే నేను చేయవలసింది. అదే నాకు తెలిసింది. నా దృష్టిలో సాధన అంటే అదే! ఆరాధన అంటే అదే! ఈ సంసిద్ధతను ఇలాగే కొనసాగనీ! ఈ సంసిద్ధతను ఇలాగే కొనసాగనీ!

- సత్య సంకలనాలు -